ఎడవం డు

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన 14, 2015

స ఎర్ ససర్



స్వదేశ్

హమ్ ఆప్ కే హై కౌన్

..ఆమీర్ కాదన్నాడు

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమీర్ ఖాన్ సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగేస్తాడన్న విషయం అందరికీ తెల్సిందే. అన్నీ పక్కాగా వుంటే తప్ప ఓకే చెప్పడు. కథ ఎంతో బాగా నచ్చితేనే పచ్చ జెండా ఊపుతాడు. అతను సాధించిన బాక్సాఫీస్ విజయాలే అందుకు నిదర్శనం. అయితే ఒక్కోసారి కాదనుకున్న చిత్రాలూ హిట్లు కొట్టేస్తుంటాయి. అలాంటి ఏడు చిత్రాలు...

ఇప్పటికీ కుటుంబం అంతా మెచ్చేసినిమా 'హమ్ ఆప్ కే హై కౌన్'. చిత్రం విడుదలైనప్పుడు అప్పటి వరకు వున్న రికార్డులన్నిట్నీ బద్దలు కొటింది. కథానాయకుడు సల్మాన్‌ఖాన్ పేరు బాలీవుడ్‌లో మారుమోగిపోయింది. అద్భుతమైన పాటలు, చక్కటి కుటుంబ కథ కలిగిన అంత మంచి చిత్రాన్ని ఆమీర్ ఎలా కాలదన్నుకున్నాడనేది అర్థమే కాదు అభిమానులకు. మరాఠా మందిర్‌లో 1000 వారాలపాటు నడిచిన ఏకైక చిత్రం 'దిల్ వాలే దుల్హనియా లే జాయేంగే'. ఈ అవకాశం కూడా పి.కె స్టార్ ఆమీర్‌ను వెతుక్కుంటూ వచ్చింది. వింతగా అనిపించినా వాస్తవమేంటంటే ఆమీర్ కాదన్న చిత్రంలో నటించిన షారూక్‌కు బాగా కలిసొచ్చింది. ఇప్పటికీ షారూక్-కాజల్ జంట హిట్ పెయిర్‌గా నిల్చిపోయింది. ఇక యష్ చోప్రా 'డర్'! మాంచి రొమాంటిక్, థ్రిల్లర్‌గా విజయం సాధించిన చిత్రం. సన్నీ డియోల్- జూహీ చావ్లా జంటగా చేశారు. విలన్ పాత్ర ఆమీర్‌ను వెతుక్కుంటూ వచ్చింది. ప్రతినాయకుడి పాత్ర కావడంతో విడిచిపెట్టాడో ఏమో! అది షారూక్‌ను వరించడం...ఖాన్ సాబ్‌కి మాంచి పేరు రావడం ఒకేసారి జరిగిపోయింది. చక్కటి ప్రేమ కథా చిత్రం 'సాజన్'. ఇందులో సంజయ్‌దత్ పోషించిన పాత్రకు ఆమీర్‌ను అడిగారు. చేయలేదనుకోండి. అయితే సల్లూ భాయ్ కూడా మంచి రోల్ చేశాడీ సిన్మాలో. ఆమీర్ కాదనడం వల్ల షారూక్ కు వచ్చిపడిన మరో అవకాశం 'స్వదేశ్'. ఈ దేశభక్తి చిత్రంలో నటించినందుకు గాను షారూక్‌కు విమర్శకుల నుంచి మంచి మార్కులే వచ్చాయి. అన్నీ సవ్యంగా జరిగితే 'జోష్'లో శరద్ కపూర్ స్థానంలో ఆమీర్ ఖాన్ కనిపించేవాడు. ఖాన్ సాబ్ నో చెప్పడంతో కపూర్ సార్ చేసేశారు. ప్రేక్షకులు మెచ్చిన వినోదాత్మక చిత్రాన్ని మిస్సయిపోయాడు ఆమీర్. 'నాయక్: ది రియల్ హీరో'లోని శివాజీ రావ్ పాత్రకుగాను మొదట ఆమీర్‌నే అడిగారు. సార్ కాదనడంతో అనిల్ ఆ అవకాశాన్ని అంది పుచ్చుకున్నాడు. రాజకీయాల చుట్టూ నడిచే ఈ చిత్రం అప్పట్లో ప్రేక్షకులను బాగానే ఆకట్టుకుంది.

●

డర్



నాయక్



ఆమీర్

దిల్ వాలే దుల్హనియా లే జాయేంగే

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

ఎదురు దాడి

ఈ విశాల విశ్వంలో ప్రతి ఒక్కరికీ తమదైన ప్రపంచం ఒకటి వుంటుంది. అది చాలా చిన్నదని ఎవరికి వారు భావించినా... వ్యక్తీకరించినా... అందులో ఎన్నో ఎత్తులు, పై ఎత్తులు, దాడులు, ఎదురు దాడులు, యుక్తులు, కుయుక్తులు... తెలియకుండానే నడుస్తుంటాయి. ఆ అపార జీవితానుభవాల్లోంచి పుట్టినవే సామెతలు, నానుడులు. వాటిని విన్నప్పుడు సరిగ్గా 'ఈ ఘటన చూశాకే చెప్పారా!' అనిపిస్తుంటుంది ఎప్పటికప్పుడు. 'ఎదురుదాడికి మించిన ఆయుధం మరొకటి లేదనేది' అలాంటి ఒకానొక నానుడి. పసిపిల్లల నుంచి పొలిటీషియన్ల వరకు ప్రతి ఒక్కరూ ఎప్పుడోకప్పుడు ఈ పద్ధతిని అనుసరించి సమస్య నుంచి బైటపడేందుకు ప్రయత్నించడం మామూలే.

తమ కారణంగా ఖరీదైన బొమ్మ విరిగినా... విలువైన వస్తువు పగిలినా ... చిన్నారులు ప్రయోగించే బ్రహ్మాస్త్రం ఏడుపు. కళ్లు వాచేలా, మొహం ఎర్రబారేలా చటుక్కున ప్రయోగించేస్తారు. ఇంటిల్లిపాదీ చుట్టూ చేరి... బతిమాలి బామాలి... ఆ బొమ్మ పోతేనేం మరోటి కొనిస్తామని వాగ్దానాలు చేసేవరకూ ... ప్రీతిపాత్రమైన పదార్థాన్ని తినిపించే వరకూ... ఆ అస్త్రాన్ని ఉపసంహరించరు. మరుక్షణమే మబ్బులు వీడిన చంద్రుళ్లలా ప్రశాంతంగా చిరునవ్వులు చిందించడం వారికే చెల్లు.

◆ మనలో మాట

గాలి తిరుగుళ్లు మాని బుద్ధిగా ఇంటి పట్టున కూర్చుని చదువుకోమని ఎంత చెప్పినా చెవికెక్కదు కొందరికి. ఎయిర్ ఫోర్స్ విభాగాధిపతుల్లా స్వేచ్ఛగా విహరిస్తారు. తీరా పరీక్షా ఫలితాలు వెలువడ్డాక... అన్ని సబ్జెక్టుల్లోను అండాలు వచ్చాయని తెలిశాక... అమ్మానాన్నల భయం పట్టుకుంటుంది. ఆత్మ రక్షణార్థం మౌనవ్రతంతో పాటు ఉపవాస దీక్ష చేపట్టి గదిలో స్వీయ బంధీలవుతుంటారు. ఎక్కడ ఏ అఘాయిత్యం చేసుకుంటారోనన్న ఆందోళనతో వారిని పల్లెత్తు మాట అనకుండా ... అనునయించి శాంతింపచేయడం పెద్దల వంతు.

చోర కళనే నమ్ముకున్నవారు నిత్యం ఆన్‌డ్యూటీలోనే వుంటారు. అన్నీ కలిసొస్తే దర్జాగా దొంగ సొత్తుతో ఉడాయిస్తారు. ఏ ఒక్కటి తేడా జరిగినా దొరికిపోతుంటారు. దొంగతనంలో కూడా ఒక్కోసారి ఎదురుదాడి పనిచేస్తుంది. దొంగే దొంగ దొంగ అన్నట్టు అన్న సామెత అందుకే పుట్టింది. ఎదుటివాడిని 'దొంగ.. దొంగ' అని అసలు దొంగ తప్పించుకోవడం తరువాత జరిగేదే. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాధిపతులిద్దరూ ఇదే పద్ధతిని అనుసరిస్తూ ఒకరిపై ఒకరు సవాలు విసురుకుంటున్నారు. 'నీవు కన్నంలో పట్టుబడ్డావు దొంగా' అని ఒక రాష్ట్రాధిపతి ఎత్తిపొడుస్తుంటే 'నా దొంగతనాన్ని పట్టుకోడానికి దొంగ కన్ను వేస్తావా దొంగా' అని మరో రాష్ట్రాధిపతి ఎదురుదాడికి దిగుతున్నారు. మొత్తం మీద ఇద్దరూ దొంగలని మాత్రం తెలిసిపోతూనే వున్నది.

■



టపా

విలక్షణ కోర్సులు

యుక్త వయస్సుకు వచ్చిన అబ్బాయిలు, అమ్మాయిల సంతోషానికి అడ్డుపడుతూ కోర్సుల కొత్త కుస్తీ మొదలవుతుంది. వీటిలో ఏమాత్రం అవగాహన లేకున్నా భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. ఏ కోర్సు చేయడం వల్ల ఏ ప్రయోజనం కలుగుతుందో, భవిష్యత్తులో ఎలాంటి జాబ్‌ను ఆశించ వచ్చో.. ఇలాంటి అంశాలు చాలా చక్కగా ఇచ్చారు. ఇలాంటి వ్యాసాన్ని అందించిన వారికి కృతజ్ఞతలు.

చందు, శ్రీకాకుళం

వాస్తవ కథ బాగుంది

వెలుగు రేడు అనే వాస్తవ కథ చాలా బాగుంది. భవేశ్ భాటియా గారు అంధులైనప్పటికీ జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. భవేశ్ గారు తల్లి చదివిన పాఠాలను విని అర్థం చేసుకుని, పీజీ పూర్తి చెయ్యటం సంతోషం కలగజేసింది. ఉద్యోగం చేసి తన తల్లిని మహారాణిలా చూసుకోవాలని అనుకున్నాడు కానీ, తల్లి కేన్సర్‌తో చనిపోవడం చాలా బాధ అనిపించింది. జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొని నీతు సహకారంతో కొవ్వొత్తుల తయారీలో ముందుండి 200 మంది అంధులకు జీవితం ఇస్తున్నారు. ఈ స్ఫూర్తి మరిచిపోలేనిది. భవేశ్ గారు ఇంకా ముందుకు సాగాలని అన్నింటిలోనూ విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

కె.సంతోషం, గాజువాక, విశాఖపట్నం

పక్షుల ఆప్తులు

పావురానికి పట్టెడు గింజలు వేస్తారు. గ్రద్ద వాలితే రాయి విసిరి చెదరగొడతారు. ఇక డేగలు, రాబందులు కాలం చెల్లాయి. సెల్ సిగ్నల్, రేడియేషన్ కారణంగా పిచ్చుక, గోరింక, రామచిలుకలు వంటివి అంతరించిపోతున్న ఈ కాలంలో డేగ, రాబందు వంటి పక్షులను కాపాడి, వాటికి అవసరమైన చికిత్స అందించడం చాలా కష్టంతో కూడుకున్న పని. అయినప్పటికి నదీమ్ షెహజాద్, మహమ్మద్ సౌద్ ఇద్దరు అన్నదమ్ములు వీటి రక్షణ చేపట్టడం ఎంతో గర్వించదగ్గ విషయం. స్ఫూర్తికి మోడల్ అనే వ్యాసం చాలా బాగుంది. డౌన్స్ సిండ్రోమ్ వ్యాధితో బాధపడే అనిత తన లక్ష్యాన్ని చేరుకోవడం అభినందించదగ్గ విషయం. పట్టుదల ఉంటే ఎంతటి కష్టాన్ని అయినా జయించవచ్చు అని మరోసారి నిరూపించారు మన స్టార్ మోడల్.

శ్రీనాథ్, వల్లూరు, కడప

కుల పంచాయితీల హక్కుల హననం

భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను దేశంలోని చాలా రాష్ట్రాల్లో కుల, తెగ, పంచాయితీలు కాలరాస్తున్నాయి. కుల, తెగ పెద్దలే పోలీసు, న్యాయమూర్తుల పాత్ర పోషిస్తు న్నారు. వెలి వేసేంత నేరమా! వ్యాసం బాగుంది. సాంఘిక బహిష్కర ణలు దళిత గిరిజనులపై ఎక్కువగా జరుగుతున్నాయి.

టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ

మరణం మరిచింది

ప్రతి మనిషి పుట్టుకకు కారణం ఉంది. మరణంతో మనిషి ప్రాణానికి విలువ లేదని అర్థమవుతుంది. సుసన్నా ముషాత్ అనే మహిళ 116 సంవత్సరాలు జీవించి ఉండటం ఆశ్చర్యకరమైన విషయం. మనిషి మరణాన్ని జయించవచ్చని చెప్ప డానికి ఈమె పుట్టుక కారణమేమో. కల కాలం జీవించకున్నా పదికాలాలు పచ్చగా ఉండే కలను ఆమె జన్యు రహస్యాల ద్వారా తెలుసుకోవచ్చేమో. **- రాము, కడప ఈ-మెయిల్**

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజమాబాద్, హైదరాబాద్-500020.

మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

సూపర్ సిస్టర్స్

కవర్ స్టోరీ 14

మహిళా టెన్నిస్ గ్రాండ్ స్లామ్ చరిత్రలో 'అమెరికన్ సిస్టర్స్' వీనస్ విలియమ్స్, సెరెనా విలియమ్స్ జోడీకి ఓ ప్రత్యేక అధ్యాయమే ఉంటుంది. డబుల్స్‌లో అక్కాచెల్లెళ్ల జంటగా, సింగిల్స్‌లో ఎవరికి వారే సాధించిన విజయాలు, రికార్డులు అపురూపం. అసమానం, నిరుపమానం. పురుషులతో సమాన గుర్తింపు తెచ్చిన ఘనత ఈ నల్ల కలువలకే దక్కుతుంది.

జీవితం 3
అగ్నిపర్వతాన్ని హత్తుకుని..

నవ్వుల్ పువ్వుల్ 4

ప్రత్యేకం 5
విశ్వమానవి ఒంటరి యాత్ర

సినిమా కబుర్లు 6
కామెడీ మాంత్రికుడు

వింత లోకం 8
చీమ కుట్లు

ప్రకృతి 9
లౌకిక వనం

చూద్దామా 10
అరేబియా సముద్ర రాణి

కథ 18
ఉసురు

రుచి 21
అన్నంతో అనేకం

బాలనేస్తాలు 22
తెలివైన అన్నాచెల్లెళ్లు

కొత్త పుస్తకాలు 24
వివిధ కోణాల్లో బ్రాహ్మణవాదం

నిన్నటి డాన్.. నేటి కోచ్..
............12

నేల నెర్రల నుండి ఓ సవ్వడి -13

అగ్నిపర్వతాన్ని హత్తుకుని..

కన్నతల్లి ఉరిమి చూస్తే పిల్లలు చటుక్కున ఆమెను చుట్టుకుని వదలరు. తల్లి కొంగుతో దోబూచులాడుతూ ఆమె దగ్గరే తచ్చట్లాడుతూ శాంతిస్తారు. పపువా న్యూ గినియాలోని రాబాల్ వాసులు కూడా అంతే! తల్లిలాంటి మౌంట్ తవుర్వర్ అగ్నిపర్వతాన్ని హత్తుకుని బతుకుతున్నారు. ఆగ్రహించి లావా ఉరుముతున్నా ఆ ప్రాంతాన్ని వదలడంలేదు. తమకొచ్చిన ఆట పాటలతో శాంతింపజేసేందుకు ప్రయత్నిస్తూ తన ఒడిలోనే సేద తీరుతున్నారు.

రాబాల్ ఒక్కప్పుడు పట్టణ ప్రాంతం. ప్రకృతి పచ్చల హారం. నిత్యం నౌకల రాకపోకలతో కళకళలాడే ద్వీప ప్రాంతం. తూర్పు న్యూ బ్రిటన్ ద్వీపానికి రాజధానిగా చెలామణి అయిన ప్రాంతం ఇప్పుడు కేవలం 150 మంది జనాభా కలిగిన కుగ్రామం. సామాన్యులు నివసించలేని అతి ప్రమాదకర ప్రాంతం. 1994లో మౌంట్ తవుర్వర్‌తోపాటు సమీపంలోని రాబలన్ కైయా, వల్కన్‌లు కూడా విస్ఫోటనం చెందడంతో చాలా ప్రాంతం లావాతో తుడుచుకుపోయింది. పచ్చని పండ్ల తోటలు బూడిదతో నాశనమైపోయాయి. నిత్యం క్రియాశీలకంగా ఉండే ఆ అగ్నిపర్వతం తరచూ భారీ విస్ఫోటనాలతో లావాను వెదజల్లుతూనే ఉంటుంది. నిరంతరం భూ ప్రకంపనలు అక్కడ ప్రజలకు సమయాన్ని సూచిస్తూ ఉంటాయి. చివరి భారీ విస్ఫోటన సమయంలో మూడు చోట్ల నుంచి లావా చిమ్మింది. సుమారు 18,200 మీటర్ల ఎత్తుకు బూడిద లేచింది. కొన్ని రోజుల పాటు బూడిద మేఘం ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. దాని వల్ల కృత్రిమంగా కురిసిన భారీ వర్షాలకు మట్టంతా కొట్టుకుపోయింది. ఆ భారీ విపత్తు నుంచి సుమారు 30 వేల మంది, చుట్టు పక్కల ప్రాంతాల వారు 50 వేల మంది అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. పరిస్థితి కుదురుకున్నాక చాలా కొద్దిమంది మాత్రమే స్వస్థలాలకు చేరుకున్నారు. అక్కడి పచ్చటి ప్రకృతి రమణీయతకి ఆయువైన అగ్నిపర్వతాలే తమ లావాతో అద్భుత అందాన్ని ఆహుతి చేశాయి.

బూడిదే విభూతి..

తమ పూర్వీకుల గుర్తుగా నిలిచిన ఆ ప్రాంతాన్ని విడవలేని వారు ఆ అగ్నిపర్వతాన్నే తల్లిగా ఆరాధిస్తున్నారు. రోజు చిన్నపాటి పేలుళ్ల, భూకంపాలు, నిరంతరం వచ్చిపడే బూడిద, విషతుల్యమైన గాలి, ఉన్న భూమంతా బూడిద రంగులో కాలి పచ్చదనం జాడలేకున్నా వారు ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టడంలేదు. ఉదయం లేచింది మొదలు వారి పని ఆరంభమయ్యేది పోగుబడిన బూడిదను తొలగించడంతో. గాలి పీల్చేందుకు ప్రత్యేక మాస్కులు ధరించి వీధుల్లోకి వస్తారు. ఇంత ప్రమాదకర పరిస్థితుల్లోను పిల్లల అల్లరికి కేరింతలకు హద్దేమీ ఉండదు. పై నుంచి పడుతున్న బూడిదతో దోబూచులాడుతూ ఆటలు సాగిపోతుంటాయి. పెద్దలు పోగు చేసిన బూడిదలోకి దూకుతూ ఆ ప్రాంతాన్ని తమ ఆటస్థలంగా మార్చేసుకున్నారు. చాలామంది తమ పిల్లలను దూర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు పంపుతారు. భీతిగొలిపే అక్కడి వాతావరణానికి వారు అలవాటు పడిపోయారు. తమ పూర్వీకుల సంప్రదాయాల్ని జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. 700 భిన్న సాంస్కృతిక జాతులున్న పపువా న్యూ గినియా ప్రపంచంలోనే విలక్షణమైనది. బైనింగ్ నృత్యం ఈ రాబాల్ వాసులకు ప్రత్యేకమైంది. ప్రకృతి శక్తులను శాంతింపజేసేందుకు వారు ఒట్టికాళ్లతో నిప్పులపై నృత్యాలు చేస్తుంటారు. వధువు రుణంగా చెల్లించే 'తోలై' అనే సంప్రదాయంలో ఆల్చిప్పల్ని నగదుగా తయారుచేసి ఇస్తారు. వీటిని డబ్బుగా వాడొచ్చు. ఇప్పటికీ కొన్నిచోట్ల వస్తు విక్రయ పద్ధతి అమల్లో ఉంది. డుక్ డుక్ మాస్కుల్ని ధరించి ప్రదర్శించే టుబువాన్ నృత్య సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న జాతుల్లో ఇదే చివరిది.

80 శాతం భవనాలు బూడిద కింద నలిగిపోయినా మిగతా వాటి బూడిద పొరల్ని స్వచ్ఛందంగా తొలగిస్తుంటారు. ఈ ప్రాంతాన్ని చూసేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తుంటారు. వారి బస కోసమే ఈ భవనాలను భద్రపరుస్తున్నారు. పర్వత పాదభూమిలో టర్కీ, ఇతర భారీ పక్షులు పెట్టే గుడ్లను సేకరించి అమ్ముతారు. కొందరు పక్క ప్రాంతాల్లోని అటవీ ఉత్పత్తులతో వ్యాపారం చేస్తారు. చేపలు పుష్కలంగా లభించడంతో ఆర్థిక సమృద్ధి సాధిస్తున్నారు. ఆస్మా ఇతర ఊపిరితిత్తుల వ్యాధులు వారిని ముప్పిరిగొంటున్నా పట్టించుకోవడంలేదు. వారి పూర్వీకులు తెలిపిన 1883నాటి అతి భారీ విస్ఫోటనంలో 36,000 మంది చనిపోయారు. వారు భయపడేది అలాంటి పేలుళ్ల గురించే. చిన్న చిన్న పేలుళ్లు తమను ఆ అగ్నిపర్వతానికి దూరం చేయవని వారు అంటున్నారు. స్థానిక పరిశోధకుల లెక్కల ప్రకారం 2050లో అలాంటి పేలుడు జరిగే అవకాశం ఉందని, అప్పటి వరకు తమకేం కాదని విశ్వాసంగా ఆ ప్రాంతాన్ని ప్రేమిస్తూ జీవిస్తున్నారు.

నవ్వుల్ – పువ్వుల్

షార్ట్‌హ్యాండ్

మా ఆయన ఈ మధ్య మరీ తెలివి మీరిపోతున్నారు తెలుసా చెప్పింది రాధ

ఏమయ్యిందే ఎందుకిలా అంటున్నావు ఆరా తీసింది అమల.

నాకు షార్ట్ హ్యాండ్ తెలియదన్న ధీమాతో ఆయన స్టెనోకి షార్ట్ హ్యాండ్‌లో ప్రేమ లేఖలు రాస్తున్నాడు.

ముడతలు

కుమార్: మా ఆవిడ నాతో గత నెల రోజులుగా గొడవ పడడం లేదు

రమేష్: ఆమెతో ఏమన్నావేమిటి?

కుమార్: నువ్వు కోప్పడ్డినప్పడల్లా నీ ముఖం పై ముడతలు కనిపిసున్నాయని అన్నానంతే.

చెంపకాయ

రాము: ఆస్పత్రిలో పన్ను పీకడానికి వంద రూపాయలట నేను చీప్‌గా పన్ను పీకమన్నాను.

సోము: ఎలా పీకాడేంటీ?

రాము: నర్స్ చేత చెంప మీద ఒక్కటి కొట్టించి పాతిక రూపాయలు తీసుకున్నాడు.

జలాంతర్గామి

మా తమ్ముడు జలాంతర్గామిలో పని చేసేవాడు వాణ్ణి ఉద్యోగంలోంచి సస్పెండ్ చేశారు అన్నాడు బాధగా చక్రి.

దేనికి? అడిగాడు సుధీర్

వాడిది వేడి శరీరం. గాలి కావాల్సినప్పుడుల్లా కిటికీలు తెరవడం వాడి అలవాటు అందుకే ! చెప్పాడు దిగులుగా చక్రి.

జైలు భోజనం



ఎల్లమ్మ: భోజనం బాగోలేదంటూ అబ్బాయి ఉత్తరం రాశాడండి.

తిక్కన్న: అలాంటప్పుడు వేరే హోటల్ కెళ్లి తినొచ్చు కదా?

ఎల్లమ్మ: అలా తినడం జైల్లో కుదరదటండి.

హిస్టరీ

ఇంట్లో ఒక్క క్షణం ఉండలేకపోతున్నాను బాధగా చెప్పాడు రమేష్

ఏం రా ఏమయింది? అడిగాడు సుందర్

నా భార్యకు కోపం వస్తే హిస్టారికల్‌గా అరుస్తోంది.

హిస్టారికల్ కాదు.. హిస్టీరికల్ సవరించాడు సుందర్

అది కాదు రా నా గతన్నంతా తవ్విస్తోంది నీరసంగా చెప్పాడు రమేష్

ప్రమోషన్

మా బాస్ నాకు ప్రమోషన్ ఇచ్చారు తెలుసా? చెప్పాడు భర్త

"అవునా ఆఫీసులో చాలా బాగా పని చేస్తున్నట్టున్నారే అడిగింది భార్య

కాదే ఆయన ఇంట్లో పని చేసినందుకే ప్రమోషన్ ఇచ్చాడే.

అసలు విషయం చెప్పాడు భర్త బాధగా.

ఫీజు

న్యాయమూర్తి: మామూలు తాళంతో బాటు కాంబినేషన్ లాక్ ఉన్న ఆ బీరువాను నువ్వు ఎలా తెరవగలిగావు.....?

ముద్దాయి:(కాస్త సందేహిస్తూ) ఇలాంటి కిటుకులు చెప్పడానికి సాధారణంగా వెయ్యి రూపాయలు వరకూ ఫీజు తీసకుంటా...

విశ్వ మానవి ఒంటరి యాత్ర

'వెళ్లండి! ప్రపంచాన్ని చుట్టి రండి. జీవితాన్ని చూసి రండి. నే చూసి వచ్చా. చాలా నేర్చుకున్నా.' మెహెర్ హీరోయ్స్ మూస్‌ను కదిపితే చెప్పేదిదే. 'నేనే దేశానికి చెందని దాన్ని. మొత్తం ప్రపంచం నా దేశం.' అని వర్జీనియా వూల్ఫ్ అన్నట్టు ఆమె విశ్వమానవి. మనదేశానికే చెందిన మహిళే అయినా ప్రపంచమంతా ఆమెదే. 18 పాస్‌పోర్ట్‌లు, 180 దేశాలు, 50 ఏళ్ల ప్రయాణాలు, అంతులేని అనుభూతులు, అబ్బురమైన అనుభవాలు, ఆదర్శం నిండిన జీవిత పాఠాలు. ఒంటరి ప్రయాణంతోనే ఆమె ప్రణయం.

నాటి బాంబే ప్రభుత్వ న్యాయ కళాశాలలో ఎల్.ఎల్.బి. పట్టా పుచ్చుకున్న మెహెర్‌కు ఎయిర్ ఇండియాలో హోస్టెస్‌గా అవకాశమొచ్చింది. 1965లో 20 ఏళ్లపుడు ఆ వృత్తిలో అడుగుపెట్టిన ఆమెకు గగన విహారం అబ్బురమనిపించింది. అంత ఎత్తు నుంచి ప్రపంచం సరికొత్తగా తోచింది. చాలా చిన్నబోయి తనను దగ్గరకు తీసుకోమన్నట్టు అనిపించింది. అంతే, ఆమె అడుగులు భూమిని చుట్టొచ్చేందుకు రెక్కలు కట్టుకున్నాయి. ఉద్యోగ విధులు పూర్తవగానే కొత్త వీధుల్లో పచార్లతో మొదలైన ఆమె ప్రయాణం, మారుమూల ప్రాంతాలకు దారి చేసుకుంటూ పోయాయి. సెలవులన్నింటినీ పోగు చేసి దూర ప్రయాణాలను కట్టింది. ప్రతి ప్రయాణం ముగింపు ఎన్నో కొత్త అనుబంధాలను కలిపింది. అనుభూతులను మిగిల్చింది. ఆమెకు మరింత ప్రయాణ దాహం పెరిగింది. ఒక్కో కొత్త మనిషి, కొత్త ప్రాంతం, కొత్త ప్రయాణం, కొత్త భాష, కొత్త జీవనం, కొత్త రుచి లోకమంతా కొత్తగా కనిపించింది. ఆ కొత్తదనంలోనే అందం, ఆనందం కనిపించాయి. ఎప్పటికప్పుడూ కొత్త జీవితాన్ని ఆస్వాదిస్తూ ఒంటరి ప్రయాణంలో దూరాల్ని మరిచింది. భూమి పిల్లలాడుకునే గ్లోబ్ సైజ్‌కు పడిపోయింది. ఎయిర్ ఇండియా ఇచ్చే కాంప్లిమెంటరీ, డిస్కౌంట్ టిక్కెట్లతో ఖర్చు కలిసివచ్చింది. మెహెర్ ప్రయాణ విషయం ఆ నోటా ఈ నోటా చుట్టిరావడంతో స్పాన్సర్ చేసేవారూ ముందుకొచ్చారు. ఆ రోజుల్లో మహిళ ఒంటరిగా ప్రయాణం చేయడమంటే అదో పెద్ద తప్పులా చూసేవారు. తనలానే పెద్ద స్వప్నాలున్న ఆమె తండ్రి వెన్నుతట్టడంతో ఈ చిన్న విషయాలెప్పుడో జెట్ స్ట్రీమ్‌లో కొట్టుకుపోయాయి. తన ప్రపంచ యాత్ర ఎక్కడ నిదానిస్తుందోనని వివాహాన్ని దూరం పెట్టేసింది. ఎవరి తోడు లేకుండా ఒంటరిగా అన్ని ఖండాల్లో విహరించింది, సముద్రాలను దాటొచ్చింది.

యాత్రల్లోనే అంతా ఉంది

మెహెర్‌కు తళుకులీనే ఖరీదైన ప్రాంతాల్లో సంతోషాన్ని కొనుక్కోవడం ఇష్టం లేదు. ఆమె మనిషి సామాన్యుడు, ఆమె ప్రపంచం పరిచయంలేని కుగ్రామం. మారుమూల గ్రామాలు, ప్రాంతాల్లో పర్యటించడానికే ఆమె రెక్కలు తొడిగింది. అక్కడే అసలైన ప్రేమమూర్తులు బంధాల్ని బంధించారనేది ఆమె ఉద్దేశం. నగరాల హోరులో కంటే పల్లెల్లోనే ప్రేమ స్వచ్ఛంగా, స్వేచ్ఛగా విహరిస్తుందట. జీవితం ఈ ప్రేమ తావులకు కట్టే ప్రయాణాల్లోనే ఉందని ఆమె అభిప్రాయం.

ఆఫ్రికా అడవుల్లో పిగ్మీలతో కలిసి బతికింది. అమెజాన్ నదీ వాహక ప్రాంతంలో రెడ్ ఇండియన్లతో కలిసి అడుగేసింది. ఆమెకు సాహసం, ఆహ్లాదం అంటే ప్రాణం. ఉత్తర, దక్షిణాలను వేరుచేసే ఈక్వెడార్‌లోని క్విటోకు చేరి కేరింత కొట్టింది. యాంగ్జే, గంగ, జాంబేజీ, అమెజాన్ సోదరిణులకు కబుర్లు మోసుకెళ్లింది. క్రియాశీలకంగా ఉండే వనౌతు అగ్నిపర్వతంపైకి ట్రెక్ చేసి భూమి శ్వాసనిశ్వాసాల్ని అనుభూతించింది. ఆండీస్ పర్వతాలు, పెరూ మాచ్చూ పిచ్చూ, బొలీవియా టిటికాకా సరస్సు దక్షిణ అమెరికాకు స్వాగతించాయి. 1975లో మార్కోపోలో తిరిగిన మధ్య ఆసియా దారిన సమర్‌ఖండ్ నుంచి గోబి ఎడారికి యాత్ర చేసింది. 1972లో ఆర్కిటిక్ సర్కిల్, 76లో అంటార్కిటికాకు చేరింది. 1978లో చైనాను చుట్టొచ్చింది. అటునుంచి ఇండోనేషియా మీదుగా టోంగా చేరి అంతర్జాతీయ డేట్‌లైన్ దాటింది. ఈస్టర్ ఐలాండ్స్ గుండా ఆస్ట్రేలియాను పలకరించి, గల్ఫ్ బాట పట్టింది. ఇష్టమైన ఇంగ్లండ్ నుంచి యూరప్‌లో చక్కర్లు కొట్టింది.

అంటార్కిటికా తొలి నేస్తం

ప్రపంచాన్ని ఉత్కంఠకు లోనుచేసిన 1976 నాటి అంటార్కిటికా 'లిండ్‌బ్లాడ్ ఎక్స్‌ప్లోరర్' మిషన్‌లో ఆమెకు అవకాశం దక్కింది. ఆ సాహస అన్వేష యాత్రకు కెప్టెన్, మార్గదర్శి అయిన స్వీడిష్-అమెరికన్ అన్వేషి లార్స్ ఎరిక్ లిండ్‌బ్లాడ్ స్వయంగా ఆమెకు ఆహ్వానం పంపి ఆమెను ఆశ్చర్యంలో ముంచెత్తాడు. అలా ఆమె అంటార్కిటికా చేరిన తొలి భారతీయురాలిగా పేరును పదిలం చేసుకుంది. కేప్‌టౌన్ నుంచి కేప్‌హార్న్‌కు బయలుదేరిన ఆ నౌకను పట్టుకునేందుకు చాలా సాహసమే చేసింది. తాను ప్రయాణిస్తున్న విమానం లీకేజీ వల్ల మొరాయిం చడంతో విడిచిపెట్టిన ఖాళీ బేసెస్‌కు తప్పిపోయింది. ప్రమాదాలకు వెరవక ఎట్టకేలకు జట్టును చేరింది. 37 ఏళ్ల ఎయిర్ ఇండియా సర్వీస్ తర్వాత 2002లో థామస్ కుక్ యాత్ర కంపెనీకి కన్సల్టెంట్‌గా పనిచేస్తోంది. డబ్బులో సంతోషం వెతక్కొదని, అందులో అది ఎప్పటికీ దొరకదని, చుట్టూ ఉన్న ప్రపంచంలోనే దాని అసలైన జాడ దాగి ఉందని, ప్రయాణం కట్టండని ఆమె చెబుతోంది.

చూపు మందగించి, వెన్ను సలుపుతోన్న 70 ఏళ్ల ముదిమి వయసులో రాబోయే నెలలో స్లెడ్జ్ బండిలో గ్రీన్‌లాండ్‌లో ఆమె ఉత్తర అమెరికాకు మరో ప్రయాణం కడుతోంది. ఆమె నడకల్లో ప్రపంచాన్ని చూడాలంటే మీరూ జట్టు కట్టండి.

- జేఎస్పీ



> రమణారెడ్డి కామెడీ మాంత్రికుడు! ఎందుకీ మాట చెప్పవలసి వచ్చిందంటే ఒక పక్క రేలంగి వెంకట్రామయ్య హీరోలతో సమానంగా స్టార్‌డమ్‌ని సంపాదించుకోగా.... అదే సమయంలో రమణారెడ్డి తనదైన హాస్య ముద్రతో రాణించడం గొప్ప విశేషం!

కామెడీ మాంత్రికుడు

నెల్లూరు జిల్లా జగ్గదేవిపేట వాసి. చిన్నతనం నుండి నటన పట్ల మేజిక్ పట్ల అభిరుచిని పెంచుకున్నాడు. గుంపులో గోవిందయ్యాలా వుండటం తనకిష్టముండదు. ఏ పని చేసినా తనకో ప్రత్యేకత ఉండాలి. ఆ రోజుల్లో సన్నగా గడ కర్రలా పొడుగ్గా ఎవరైనా ఉంటే రమణా రెడ్డిలా ఉన్నాడు అనడం పరిపాటైపోయింది. చిత్ర రంగంలోకి ప్రవేశమే ఒక ప్రత్యేకతని సంతరించుకుంది.

అప్పట్లో వై.వి రావు హీరో, నిర్మాత, దర్శకుడు 'మానవతి' అనే సినిమా తీస్తున్నాడని తెలిసి కలిశాడు. రమణారెడ్డిలో ఏదో స్పార్క్ వుందని గ్రహించిన యారగుడిపాటి వరదరావు (వై.వి.రావు) ఒక వేషం ఇచ్చి ప్రోత్సహించాడు. అయితే తనకు పరిచయం వున్న ఎ. శంకర్ రెడ్డి (లవకుశ నిర్మాత) నిర్మాత, దర్శకుడైన కె.యస్. ప్రకాశరావుకి పరిచయం చేశాడు. అదే సమయంలో 'దీక్ష' అనే సినిమా మొదలుపెట్టాడు ప్రకాశరావుగారు (రాఘవేంద్ర రావు తండ్రి). ఇక్కడే చెప్పుకోదగ్గ విశేషం మరొకటి వుంది. ఇదే సినిమాతో మనసు కవి ఆత్రేయ 'దీక్ష' సినిమాతో పాటు రచయితగా పరిచయమయ్యి ఎన్నటికీ చెరిగిపోని చరిత్రను సృష్టించాడు. రమణారెడ్డి దీక్ష సినిమాతో మంచి పేరు తెచ్చుకున్నాడు. రమణారెడ్డి హావభావాలు ..సంభాషణలు పలికే తీరు అక్కినేనికి, ఎన్.టి.ఆర్ కి బాగా నచ్చింది. అందుకే ప్రోత్సహించారు.

ప్రేక్షకులు మెచ్చిన పాత్రలు

యల్.వి.ప్రసాద్ దర్శకత్వం వహించిన మిస్సమ్మ చిత్రంలో సావిత్రిని ప్రేమిస్తున్నానంటూ వెంటబడిన డేవిడ్ పాత్రలో రాణించాడు. ' మాయా బజార్' చిత్రంలో చిన్న మామగా కాసేపు కనిపించిన ప్రేక్షకులకు కలకాలం గుర్తిండిపోతాడు. గుండమ్మ కథ చిత్రంలో కంచు గంటయ్య పాత్ర ద్వారా ప్రేక్షకుడికి గుర్తిండిపోతాడు. ముఖ్యంగా రాజనాల తండ్రిగా, పాలల్లో కుళాయి నీళ్ళు కలిపే పిసినారిగా దురాశపరుడిగా అత్యంత సహజంగా నటించాడు. సువర్ణ సుందరి చిత్రంలో రేలంగి, రమణారెడ్డి, బాలక్రిష్ణల కాంబినేషన్ మరిచిపోగలమా? 'ఏరా మనతోటి గెలిచే వీరుడెవ్వడురా?' భళాభళి శూరుడెవ్వడురా? పెద్ద పెద్ద అంగలేస్తూ.. ఆ పాటను రమణారెడ్డి అభినయించిన తీరు మరిచిపోలేం.

'వేంకటేశ్వర మహత్యం' చిత్రంలో వెర్రి గొల్లవాని పాత్రలో జీవించాడు. 'లవకుశ' చిత్రంలో వాల్మీకి ఆశ్రమ వాసిగా, సూర్యకాంతం భర్తగా, కొడుకు చేసే అల్లరికి భయపడి గంగవెర్రులెత్తే పిరికివానిగా, లవకుశతో పాటు అయోధ్యకు వెళ్ళినప్పుడు సింహద్వారం వద్ద ఆటపట్టించిన సిపాయిలకు మొదట్లో దర్పం చూపించి తర్వాత కాళ్ళ బేరానికి రావడం నవ్వులు పండిస్తుంది. 'రాముడు – భీముడు' చిత్రంలో రేలంగి మామగారిగా 'పో పోరా పొమ్మికన్, నా గృహంబునకు, భోజనముకు ఇక రావలదు, పో పోరా పొమ్మికన్' మరిచిపోగలమా? కులగోత్రాలు చిత్రంలో పేకాట రాముడిగా నెత్తిమీద తుండు వేసుకుని 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే అయ్యయ్యో జేబులు ఖాళీ అయ్యెనే' ఇప్పటికీ పేకాట రాయుళ్ళు డబ్బులు పోగొట్టుకున్నప్పుడు ఈ పాటే

గుర్తుకొస్తుంది.

సహజ నటన

'ఇద్దరు మిత్రులు' చిత్రంలో విజయ్ తండ్రిగా నటిస్తాడు. కూతురు శారద– శారద భర్త పద్మనాభం, పద్మనాభం తండ్రి రేలంగి అంతా హేమాహేమీలే ...రామభక్త రామదాసుగా పరమానందభరితుడై 'శ్రీరామ నీ నామమెంతో రుచిరా...' తాళాలు వాయిస్తూ పాడిన పాట దగ్గరకు వచ్చిన అజయ్‌ని విజయ్ అనుకొని 'ప్రసాదం వేళకు వచ్చావూ... అఘోరించు' అంటూ నాలుగు కొబ్బరి ముక్కలు చేతిలో పడేయడం ఆ డామినేషన్ ఎంత సహజంగా వచ్చిందో మాటల్లో చెప్పలేం' అంటుండేవారు. అక్కినేని ముఖ్యంగా కూతుర్ని కాపురానికి తీసుకెళు తున్న సందర్భంలో వీధిలో హడావుడి చేస్తూ ఇరుగు పొరుగు వారి దగ్గర అంగలు వేసి నడిచేతీరు రమణారెడ్డి నటనకు పరాకాష్ఠ. రేలంగితో ముచ్చట్లు ..విసుర్లు.. చాలా సహజంగా వుంటాయి. రమణారెడ్డి పాత్రలో పరకాయ ప్రవేశం చేసేవాడేమో అనిపిస్తుంది. తెరమీద అతను నటిస్తున్నప్పుడు అతని లోపాలు దివిటీ పెట్టి వెతికినా కనిపించవు. అలా నటనతో మంత్ర ముగ్ధుల్ని చేస్తాడు రమణారెడ్డి.

మ్యాజిక్ ప్రదర్శనలు

చిన్నతనంలోనే మేజిక్ పట్ల ఆకర్షితుడై నేర్చుకున్నాడు. వీధుల్లో మొదలైన ఆయన మేజిక్ ప్రదర్శనలు ..పెళ్లి పందిళ్ళు, ఫంక్షన్లు, చివరకూ విందులూ వినోదాల్లోనూ చోటు చేసుకున్నాయి. షూటింగ్ జరుగుతున్నప్పుడు ఒక్కోసారి తమాషా చేసేవాడు. రమణారెడ్డికి మద్యం అలవాటుంది. షూటింగ్‌కి రావడం ఆలస్యమైతే ప్రొడ్యూసర్లు ఒకరి మొహం మరొకరు చూసుకునే వాళ్ళు. మొహాలు చూసుకుంటే ఏం కనిపిస్తుంది వాచీలు చూడండి. నేను షూటింగ్‌కి టైమ్‌కి వచ్చానో లేదో!' అనేవాడు. ఆశ్చర్యం. టైమ్ చూస్తే అప్పుడే ఏడు గంటలయ్యేది. నటి బాల సరస్వతి మంచి కలుపుగోలు తనం మనిషి. రమణా రెడ్డితో చాలా సినిమాల్లో నటించింది. 'ఎన్నాళ్లైనదిరో మావయ్య ఎప్పుడు వచ్చావురో మావయ్య ఎన్నాళ్ళుం టావురో' పాట ఇందులో గారెలు, బూరెలు రొయ్యలు, మంచాలు, పరుపులూ పదాల వరద చోటు చేసుకుంటుంది. ఇప్పటికే ఈ పాట పల్లెల్లో ప్రచారంలో వుంది. బాల సరస్వతి వంటినిండా నగలు దిగేసుకొని ఓసారి సెట్‌కి వచ్చింది. కొత్తగా కొనుక్కున్న నగలను అందరికీ చూపించి సంబరపడిపోతోంది. ఇంతలో రమణారెడ్డి వచ్చాడు. నగలెలా వున్నాయి రెడ్డి గారు, నగలు బాగున్నాయా ? నేను బాగున్నానా? అని అడిగింది. నగలంటావేంటి? ఏవీ నగలు కనిపించవే? అయినా నీకు బంగారం నగలెందుకూ? అన్నాడు దాంతో అవాక్కైపోయిన బాల సరస్వతి మెడ బోసిగా వుండటం చూసి లబోదిబోమంది. కాసేపు ఏడిపించాక 'తల్లీ! నగలకేం కాలేదు. నీ మెళ్లోనే వున్నాయి. చూసుకో! అన్నాడు రెడ్డిగారు. ఆశ్చర్యం నిజంగానే ఉన్నాయి. పదుగుర్నీ నవ్వించేందుకే అప్పుడప్పుడు సినిమా నటీనటులతో సాంకేతిక నిపుణులూ పట్టుబట్టి మరీ రమణారెడ్డి గారితో ఒకటి రెండు ఐటమ్స్ చేయించుకొని

సంబరపడిపోయేవారు. రమణారెడ్డి వినోదం కోసమే మేజిక్ చేశాడు. కాని సంపాదన కోసం చెయ్యలేదు. అదే ఆయన ప్రత్యేకత.

తనదైన వ్యక్తిత్వం

రమణారెడ్డికి తన పరిధులు తెలుసు. అందుకే సీనియర్స్‌ని గౌరవించేవాడు. నటిస్తున్నప్పటికీ తన హద్దుల్లో తనుండేవాడు. సెట్‌లో రేలంగితో పోటీపడి నటించేవాడు కానీ, సెట్ బయట రేలంగి గౌరవమర్యాదలకు భంగం కలిగించేవాడు కాదు. మా హాస్య కుటుంబానికి పెద్ద రేలంగి అన్నయ్య.. ఆయన్ని గౌరవించుకుంటే మమ్మల్ని మేం గౌరవించుకున్నట్లే అని తరచూ చెప్పేవాడు. తను నటించే చిత్రాల్లో పాత్ర ఏదైనా చిత్తూరు యాసలో మాట్లాడి మెస్మరైజ్ చేసేవాడు.కమెడియన్లు అయినా శివరావు, రేలంగి పద్మనాభం లాంటి నటులు స్టార్ డమ్ రాగానే హీరో పాత్రలు చేశారు. అలా చేసి గెలుపోటములు చవిచూశారు. రమణా రెడ్డి హీరో కావాలన్న ప్రయత్నం ఏ రోజూ చెయ్యలేదు. అక్కినేనికి,

భారతి, ఎన్టీఆర్‌తో.

ఎన్టీఆర్‌తో...

ఎన్.టి.ఆర్‌కి, హరనాథ్ తదితరులు హీరోలుగా కొనసాగుతున్న కాలంలో పెద్ద హీరోలకి హీరోయిన్లకీ తండ్రిగా నటించి ప్రేక్షకుల ఆమోద ముద్ర పొందాడు.

'ఈ ఫేసుకి ఈ తృప్తి చాలు.' అంటూ తన మీదే తనే జోకు వేసుకొనేవాడు. రెమ్యూనరేషను కోసం ఏ రోజు పట్టుబట్టలేదు. ఇచ్చే చెయ్యికి పుచ్చుకునే చెయ్యికి మధ్యనే ఆ రహస్యం ఉండిపోవాలనేవాడు. అలాగే చివరివరకూ తన నిజాయితీని నిరూపించు కున్నాడు. ప్రొడ్యూసర్లు కష్టాల్లో వున్నప్పుడు పారితో షికం లేకుండా నటించిన సందర్భాలున్నాయి. సెట్‌లో సీరియస్‌గా వుండేవాడు. నటించేటప్పుడు మాత్రం నవ్వులు పూయించేవాడు. తన కుటుంబ ప్రస్తావన లేకుండా ఆడంబరాల జోలికి పోకుండా తన ఉనికిని కోల్పోకుండా చివరి వరకూ తన స్థానం నిలబెట్టుకున్నాడు.

చీకటి వెలుగులు

రమణారెడ్డి జీవితంలో ఎన్నో చీకటి వెలుగులు, కష్టాలు చవి చూశాడు. స్టార్‌డమ్ కోసం సంపాదన కోసం తనకు మాత్రమే పేరు రావాలన్న ఆలోచన ఏ రోజూ వుండేది కాదు. ఈ జీవితమే మూణ్ణాళ్ళ ముచ్చట ఎప్పుడు ఈ ప్రాణం ఎగిరిపోతుందో తెలియదు. నీటి బుడగ లాంటి ప్రాణానికి ఆర్భాటాలెందుకు? అనేవాడు. సినిమా తల్లి పుష్టిగా కళకళలాడుతున్న రోజుల్లో ఆ వేడుకల్లో తనదీ ఒక వెలుగు రేఖ అయినందుకు గర్వపడుతున్నానని మురిసి పోయేవాడు.

జీవితంలో 'తృప్తి'ని మించిన సంపద లేదని, జీవితాంతం తృప్తిగా బతికాను. ఇంకేం కావాలి అని వేదాంతం వల్లించేవాడు. అందుకే అర్ధాయుష్షు యాభైమూడేళ్ళకే 'చీకటి వెలుగులు' చివరి చిత్రంగా కన్నుమూశాడు. తన అలవాట్లు మృత్యువుకి దగ్గర చేశాయని కొందరు విమర్శించినా ఇంకొన్నాళ్ళుంటే బావుండు అని పదిమంది అనుకుంటుండగా అంతర్ధానమైపోవడం అదృష్టం అనేవాడు. అలాగే పోయాడు. హాస్యాన్ని రమణారెడ్డి పలికించేవాడు కాదు పాత్ర పలికించేది. అదీ తన ప్రత్యేకత!

ఇమంది రామారావు

9010133844

ముసుగు గడియారం

అమెరికాలోని వాషింగ్టన్ డీసీలోని స్మిత్‌సోనియన్ మ్యూజియంలో ఓ భూత గడియారం (ఘోస్ట్ క్లాక్) ఉంది. దానికేం దెయ్యం పట్టలేదులెండి. కాలాన్ని స్తంభింపజేసినట్టు చడీ చప్పుడు లేకుండా అలా పడి ఉండటంతో దానికి ఆ పేరు పెట్టారు. ఇంతకీ ప్రత్యేకత ఏమిటంటే దీనికి ఎందుకిలా తెల్లని వస్త్రం కప్పారో, ఇంతకీ ఇది ఏమై ఉంటుందోనని అనుకుంటారు. తరచూ వెళ్లే సందర్శకులకు ఎప్పుడు వెళ్లినా అదే వస్త్రం కప్పి దర్శనం ఇస్తుండటంతో ఇంతకీ అదేంటోనని సమాచార పటం వైపు చూసి ఆశ్చర్యపోతున్నారట. అది ఒక గడియారమని, దాని మీద ఏ వస్త్రం కప్పలేదని తెలుసుకుని విస్తుపోతున్నారు. మహాగని చెక్కను అలా తెల్లని వస్త్రంలా, తాడులా చెక్కారు మహా శిల్పి వెండెల్ క్యాసిల్. 1980లో తాను సృజించిన 13 గడియారాల్లో ఇది ఒకటి. తెల్లటి వస్త్రంలా కనిపించేందుకు బ్లీచింగ్ చేసి, కింది భాగం వాల్‌నట్ రంగులోకి రావడానికి స్టెయినింగ్ చేశారు. వస్త్రం ముడతల్ని చక్కని సిమ్మెట్రీతో చెక్కారు. కాలానికి అవధి లేదని తెలిపేందుకు సూచకంగా గడియారపు మెకానిజాన్ని ఉపయోగించలేదు. ఇంత గొప్ప కళాకారుడైనందునే ఆయన్ను ఫాదర్ ఆఫ్ ఆర్ట్ ఫర్నిచర్‌గా కీర్తిస్తారు.

గ్రాఫిటీ @ 65

మూడు కాళ్ల కుర్చీలా మూలన పడి బతికే కర్మ మాకేంటని పోర్చుగల్ బామ్మలు అంటున్నారు. బామ్మ అనగానే చేతిలో ఊలుతో చిన్నచిన్న అల్లికలు చేస్తూ కాలం వెళ్లదీసే చిత్రం నుంచి తప్పించుకున్నారు లిస్బన్‌కు చెందిన ఆ గ్యాంగ్ వారంతా. తాతలేమో అలా నిస్సారంగా వరండాకు అతుక్కుపోకుండా చేతికి గ్లోవ్స్ తొడిగి, ముఖానికి రుమాలు కట్టి పొద్దున్నే వీధులెంట పడుతున్నారు. లాట 65 అనే ఈ గ్యాంగ్ బామ్మ, తాతలు గ్రాఫిటీ నేర్చేసి కుర్రాళ్ల వీధుల్ని వర్ణశోభితం చేస్తున్నారు. వయసనేది సంఖ్యేనని, ముందు కుర్రాళ్లైంది వాళ్లేనని చెబుతున్నారు. యువతకు సింబల్‌గా చెప్పే గ్రాఫిటీలో ఇరగదీస్తున్నారు. నాలుగ్గోడల మధ్య వాళ్ల జీవితాలు నలిగిపోకుండా గ్రాఫిటీ వారికి కళను తెస్తోంది. కుర్ర ఆర్టిస్టలతో కలిసి సుమారు వంద మంది పెద్ద ఆర్టిస్టులు అయిపోయారు. మరింత మందిని తమ గ్యాంగులో కలుపుకుంటున్నారు. తరాల మధ్య అంతరాలను గ్రాఫిటీతో చెరిపేస్తున్నారు. లారా పెబెల్ రోడ్రిగ్స్ అనే ఆర్కిటెక్ట్ ఈ కార్యక్రమానికి అంకురం తొడిగింది. రెండు రోజుల వర్క్‌షాప్‌ను మూడు దశలుగా మార్చి శిక్షణనిస్తున్నారు. గ్రాఫిటీ చరిత్ర, ప్రాముఖ్యత, లాభాలను వివరిస్తున్నారు. తర్వాత దశలో తేలిగ్గా గ్రాఫిటీ వేసేలా స్టెన్సిళ్లతో మాతృకలు తయారు చేయిస్తున్నారు. చివరగా వారిని వీధులకు తీసుకెళ్లి యువ కళాకారులతో కలిసి గోడలపై ఉత్సాహంగా గ్రాఫిటీ వేస్తున్నారు. వీరి సందడి చూసి అప్పుడే ముదిమి వయసు భయాలు పట్టుకున్నవారు కాస్త రిలీఫ్ అవుతున్నారు. జీవితంలో సందడి లేకపోతే వయసుతో నిమిత్తం లేకుండా ముసలివారి కిందేనని చెబుతూ బిగుసుకు కూర్చునే కుర్రాళ్లకు వైల్డ్‌స్టైల్ కామెంట్లతో చురకలు వేస్తున్నారా స్వీట్ సిక్సీస్.

గాయానికి కుట్లు వేసేందుకు కొత్త కొత్త వస్తువులు వస్తున్నాయి. చర్మాన్ని అతికించే జెల్ లాంటివి అందుబాటులోకి వచ్చాయి. అయితే చీమలతో గాయానికి కుట్లు వేస్తారనే సంగతి తెలుసా. అవీ ఇవీ కావు గాట్టిగా కుట్టే కోపిష్టి సైనిక చీమలే దీనికి ఉపయోగపడతాయి. పూర్వకాలంలో వీటినే ఎక్కువగా వాడేవట కొన్ని ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా తెగలు. ఇప్పటికీ కొన్ని చోట్ల సంప్రదాయంగా దీన్ని కొనసాగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏ సాధనం లేనపుడు వీటిని ఉపయోగిస్తున్నారు. కండను చీల్చేలా బలంగా కుట్టే చీమలతో చీలిక దగ్గర కుట్టిస్తారు. సైనిక చీమలు గట్టిగా కండను పట్టుకుని ఒక పట్టాన వదలవు. ఈ లోగా వాటి శరీరాన్ని వేరు చేసి కుట్టిన చీమ తలల్ని అలా వదిలేస్తారు. మూడు రోజుల తర్వాత గాయం మూతబడకపోతే మరోసారి కుట్లు వేస్తారు. దక్షిణ అమెరికాలో ఎటికాన్, తూర్పు ఆఫ్రికాలో డొరీలస్ రకం చీమ కాలనీల పహారా సైనిక చీమల్ని వాడతారు. మూడు వేల ఏళ్ల నాటి హిందూ చికిత్స గ్రంథాల్లో ఈ విషయం రాసి ఉందట. అలాగే ఏసియా మైనర్‌లో లభించిన ఓ ఆధారం ప్రకారం అంగుళం గాయానికి పది చీమల్ని వాడతారని తెలిసింది. అయితే ఈ పద్ధతిని అవలంబిస్తే....ఇన్‌ఫెక్షన్ సోకేఅవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

చీమ కుట్లు



ప్రకృతి

మతానికో వృక్షం అతి పవిత్రం. కళాకారునికో చెట్టు అది అబ్బురం. దేశానికో మాను జాతి చిహ్నం. వీటన్నింటినీ గౌరవిస్తూ కేరళకు చెందిన మహమ్మద్ ఖోయా ఓ చోట చేర్చాడు. లౌకిక వనంగా మార్చి సమాజానికి అంకిత మిచ్చాడు.

లౌకిక వనం

కోజికోడ్ జిల్లాలోని ఆరంబ్రమ్‌కు చెందిన ఖోయాకు ఐదేళ్ల క్రితం స్థానికంగా ఉన్న రెండున్నర ఎకరాల వారసత్వ ఆస్తి వచ్చింది. కోట్లు పలుకుతున్న భూమి ధర. ఇంకేంటి చాలా డబ్బు అని కుటుంబీకులు సంబరపడ్డారు. కానీ, ఖోయా ఆ భూమిని ఏం చేయదలుచుకున్నాడనేది చెప్పేసరికి వారంతా కంగుతిన్నారు. పసిడి భూమిని పిచ్చి మొక్కలతో నింపేస్తానంటున్నాడు... పిచ్చేం పట్టలేదు కదా అనుకున్నారు. ఖోయాకు వృక్షాలంటే చాలా ఇష్టం. ప్రకృతిచ్చిన ఏదో ప్రత్యేక బంధం వృక్షాలనేది ఆయన అభిప్రాయం. చిన్నప్పటి నుంచి ఎంతో సాహిత్యాన్ని చదివాడు. వాటంతటా చెట్లతో సాన్నిహిత్యమే కనిపించింది. ఏ మత గ్రంథం తిరగేసినా ఏదో ఒక చోట వృక్ష ప్రస్తావనే. వాటికి అలౌకిక శక్తులను ఆపాదిస్తూ ప్రత్యేకంగా నిలబెట్టాయి. అదంతా అర్థం చేసుకున్నా లేకున్నా, జీవి మనుగడకు ప్రాణ వాయువును, భూమి చల్లగా ఉండేందుకు నీడను ఇస్తున్నాయి అది చాలదూ, అంతకన్న దైవిక శక్తి ఇంకేం కావాలి అనేది ఆయన అభిప్రాయం. ఆ చెట్లను ఆయన అమితంగా ప్రేమించాడు. ఆ ప్రేమను వ్యక్తీకరించేందుకు రకరకాల మొక్కలను సేకరించి వనాన్ని రూపొందించాడు.

మహమ్మద్ ఖోయా

వంగ మామిడి నుంచి పైన్ వరకు..

గేబ్రియల్ గార్సియా మార్కిజ్ 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్'లో ఆకాశానికెత్తిన చెస్ట్‌నట్ వృక్షం ఆ లౌకిక వనంలో దర్పాన్ని ప్రదర్శిస్తుంది. దాన్ని లాటిన్ అమెరికా ట్రిప్‌కెళ్లినపుడు తెచ్చాడు. కేరళ ప్రసిద్ధ కథకుడు వైకోమ్ మహమ్మద్ బషీర్ మదిని దోచేసిన వంగ మామిడి చెట్టును నాటాడు. కవి కమలాదాస్‌కు ఇష్టమైన నీర్మతలమ్ చెట్టునూ సేకరించాడు. ఖలీల్ జిబ్రాన్ ఆరాధించిన సుబాబుల్ వృక్షానికి స్థలమిచ్చాడు. హిందూ పురాణాల్లో ప్రత్యేకంగా పేర్కొన్న కాదంబ వృక్షాన్ని, బైబిల్‌లో చోటిచ్చిన పైన్ చెట్టును పక్కపక్కన చేర్చాడు. స్వర్ణ వ్యాపారి అయిన ఖోయా తన వ్యాపారంపై విదేశాలు వెళ్లినప్పుడల్లా అక్కడి నుంచి ప్రత్యేకమైన జాతి చెట్లను తెస్తాడు. ఈయన సేకరణ గురించి విన్నవారు కూడా తమ వంతు చెట్లను బహూకరిస్తుంటారు. విదేశాల నుంచి పంపిస్తుంటారు. ఆయన ఏ పని మీద ఏ ఊరు, దేశం వెళ్లినా మొదటి ప్రాధాన్యత మొక్కల్ని సేకరించడమే. ముందే సమాచారాన్ని సిద్ధం చేసుకుంటాడు.

ఖోయా ముప్పై ఏళ్లపాటు దుబాయ్‌లో పనిచేశాడు. తిరిగి స్వదేశానికి వచ్చి తన ఊరును చూసి విస్తుపోయాడు. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన తన ప్రాంతం ఇప్పుడు కాంక్రీట్ వనమైపోయింది. గజం స్థలం దొరికితే చాలు ఏదో ఒక నిర్మాణానికి ప్లాన్‌లు సిద్ధం చేసేవారు తయారయ్యారు. ఆయనకది బాధ కల్గించింది. తన వంతు ఏదైనా చేద్దామనుకోగా ఇంతలో సారవంతమైన భూమి వనానికి బీజం వేసింది. ఇంటిలో భార్య, పిల్లలే వ్యతిరేకించినా ఆయన వెనకడుగు వేయలేదు. వనాన్ని తీర్చిదిద్దేందుకు తీరిక చేసుకుని మరీ పనిచేశాడు. ఇప్పుడదొక నందనవనమైంది. ప్రపంచంలో ఎక్కడెక్కడి నుంచో తెచ్చిన వృక్షరాజాలకు ఆలవాలమైంది. వీటిని కేవలం తన కోసమని కాక సమాజానికి అంకితమిచ్చాడు. ప్రతిరోజూ దూరప్రాంతాల నుంచీ బడి పిల్లలు ఎక్స్‌కర్షన్లకు ఇక్కడకు వస్తారు. వారికి ఉపయోగపడేలా ప్రతి చెట్టుకు ముందు వాటి వాడుక పేర్లు, శాస్త్రీయ నామాలు, అవి ఏ జాతికి చెందినవో, ఎక్కడ లభ్యమవుతాయో, ఏ సాహిత్యంలో పేర్కొన్నారో లేదా ఏ మతగ్రంథంలో దానికి విశేషముందో తెలిపే సమాచార బోర్డులను ఏర్పాటు చేశాడు. ఆ వనాన్ని సందర్శించడానికి ఎటువంటి టికెట్ కొనాల్సిన అవసరం లేదు. ఆ అనుభూతులు పూర్తిగా ఉచితం. ఈ లౌకిక వనం విశేషాలు ఆ నోటా ఈ నోటా పాకి కేరళలో పర్యటిస్తున్న విదేశీయులు ఈ వనాన్ని ప్రత్యేకంగా సందర్శించి వెళుతున్నారు. పరిశోధకులకు కూడా వ్యయప్రయాసలను తగ్గి స్తోంది. దీన్ని సందర్శించిన వారంతా చెట్ల పెంపకం విలువను గ్రహించి తమ వంతు ప్రయత్నాలను ప్రారంభిస్తున్నారు. ఎన్ని నినాదాలిచ్చినా, ఎన్ని పాఠాలు బోధించినా తెలియని చెట్ల విలువ ఇక్కడ చేసిన ఓ సందర్శనతో విద్యార్థులకు అర్థమవుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పచ్చదనం వార్త తెలిసిన కుందేళ్లు, చిలకలు వంటి రకరకాల పశు పక్ష్యాదులు దీన్ని ఆవాసంగా చేసుకున్నాయి. అవి తమ కిలకిలా రావాలతో ఖోయాకు కృతజ్ఞతలు చెప్పేస్తున్నాయి. మరి మనమూ...!

చుద్దామా

అరేబియా సముద్రరాణి

హాయిగొలిపే సముద్రపు పిల్లగాలులు, సుగంధ ద్రవ్య పరిమళాలు, భిన్న సంస్కృతుల కలబోత ఆ నగర విశిష్టత. ప్రపంచంలోనే ముఖ్యమైన అది పెద్ద నౌకాశ్రయంగా దీనికి పేరుంది. ఒకప్పుడు ఈ నగరాన్ని పోర్చుగీసువారు, తర్వాత డచ్‌వారు ఏలారు. అదే కేరళలోని కొచ్చి నగరం. ఆ నగర విశేషాలు...

కేరళరాష్ట్ర రాజధాని తిరువనంతపురమైనా వ్యాపార వాణిజ్యాల రాజధానిగా పేరు తెచ్చుకుంది మాత్రం కొచ్చి నగరం. భారతదేశంలోని అందమైన పర్యాటక స్థలాల్లో ఇదొకటి. అంతేకాదు ప్రపంచంలోనే ముఖ్యమైన, పెద్ద నౌకాశ్రయం ఇది. ఎందుకంటే భూ, సముద్ర, వాయు మార్గాల ద్వారా రవాణా సౌకర్యం ఉన్న అతికొద్ది నౌకాశ్రయాల్లో ఇదొకటి. అందుకే ఈ నగరాన్ని 'అరేబియా సముద్ర రాణి' అంటారు.

ఆ నగరం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇక్కడ వ్యాపార వాణిజ్యాలు చేయాలని చైనా, అరబ్బు దేశాల వారు ఉవ్విళ్లూరారు. యూరోపియన్ దేశస్తులు ఏకంగా ఆ నగరాన్ని తమ సొంతం చేసుకున్నారు. వెనిస్ దేశస్థులు సుగంధ ద్రవ్యాల వ్యాపారం నిరాటంకంగా సాగించారు. వీరందరికీ ఆ నగరమంటే ఎందుకంత ఇష్టమంటే... ఏ దేశంతోనైనా సత్సంబంధాలు చేయడానికి వీలైన నౌకాశ్రయం అక్కడ వుండడమే. ఇన్ని దేశాల సంస్కృతులు అక్కడ ఏళ్ల తరబడి ఉన్నాయి. అందుకే ఆ నగర వీధుల్లో ఇప్పటికీ ఆయా సంస్కృతుల పరిమళం గుబాళిస్తుంది. ప్రకృతి సౌందర్యం పర్యాటకులనే కాదు, నిత్యం అక్కడుండే స్థానికులను కూడా మంత్రముగ్ధులను చేస్తుంది.

చరిత్ర పుటల్లో కొచ్చి...

క్రీ.శ.1498లో వాస్కోడిగామా తన వ్యాపార స్థావరంగా కేరళలోని కాలికట్ తీరాన్ని ఎంచుకున్నాడు. తర్వాతికాలంలో ఇక్కడే స్థిరపడ్డాడు. మరో రేండేళ్లకు పోర్చుగీసువారు వచ్చి కొచ్చి మహారాజు అనుమతితో స్థిర నివాసం నిర్మించుకున్నారు. 1662-63 ప్రాంతంలో పోర్చుగీసు వారి ప్రాబల్యం తగ్గి ఆ ప్రాంతం డచ్చివారి అధీనంలోకి వెళ్లింది. ఆ తర్వాత బ్రిటీష్ పాలనలోకి వచ్చింది. అందుకే ఇప్పటికీ యూరోపియన్ సంస్కృతిని చాటి చెప్పే రాజప్రాసాదాలు, ప్రార్థనా మందిరాలు, చారిత్రక కట్టడాలు ఇక్కడ కనిపిస్తాయి.

అతి ప్రాచీన చరిత్ర కలిగిన కొచ్చి నగరాన్ని పాత కొత్తల మేలుకలయికగా అభివర్ణించొచ్చు. ఫోర్ట్ కొచ్చి, మట్టన్‌చెరి, ఎర్నాకులం, ఎడపల్లి, వెల్లింగ్‌టన్, తేవర, నైటిల్ల తదితర ద్వీపాలన్నీ కలిసి కొచ్చి నగరంగా ఏర్పడ్డాయి. ఈ ద్వీపాలన్నింటినీ వంతెనల ద్వారా కలిపారు.

సందర్శనీయం...

మెరైన్ డ్రైవ్‌లోని బోట్‌జెట్టీ నుండి కేరళ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కేటీడీసీ) బోట్లలో మట్టన్‌చెరి, పోర్ట్ కొచ్చిలకు వెళ్లొచ్చు. సముద్ర కాలువల (బ్యాక్‌వాటర్స్)లో ఈ పడవ ప్రయాణం అద్భుతంగా ఉంటుంది. ఒకవైపు ఎర్నాకుళంలోని అత్యంత ఆధునిక ఆకాశ హర్మ్యాలు, ఇంకొక వైపు బోల్‌ఘట్టీ, పోర్ట్‌కొచ్చి, మట్టన్‌చెరి దీవులు, మరోవైపు కొచ్చి నౌకాశ్రయంలో నిలిచి ఉన్న పెద్ద నౌకలు... ఇలా ఎటు చూసినా అద్భుతమైన దృశ్యాలే కనిపిస్తాయి.

ఫోర్ట్‌కొచ్చిలో రెండంతస్తుల అందమైన డచ్ ప్యాలెస్ ఉంది. దీన్ని పోర్చుగీసు వారు నిర్మించారు. తర్వాత వచ్చిన డచ్‌వారు దీనికి ఎన్నో మార్పులు చేర్పులు చేసి కొచ్చి మహారాజుకు కానుకగా ఇచ్చారుట. అందుకేనేమో దీన్ని డచ్ ప్యాలెస్ అనే పిలుస్తుంటారు. ఈ కోట గోడలపై చిత్రించిన

సముద్రపు కాలువలో పడవ ప్రయాణం

చైనా వలలతో చేపల వేట

రామాయణ, మహాభారతాలకు సంబంధించిన చిత్రాలను చూసి తీరవలసిందే.

యూరోపియన్లు మనదేశంలో నిర్మించిన అతి పురాతన సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి కూడా ఇక్కడే ఉంది. వాస్కోడిగామా కొచ్చిలోనే మరణిస్తే, ఆయన మృత దేహాన్ని ఈ చర్చిలోనే సమాధి చేశారు. తర్వాత చాలా కాలానికి ఆయన అస్థికలను పోర్చుగల్‌కు తీసుకెళ్లారని చెప్తుంటారు. అయితే సమాధి ప్రదేశాన్ని ఇప్పుడూ చూడొచ్చు.

చూడాల్సిన ప్రదేశాల్లో మరోటి జ్యూయిష్ సినగోగ్. ఇది యూదుల ప్రార్థనా మందిరం. ప్రపంచంలోనే అతి పురాతనమైనదట. ఈ మందిరం ప్రత్యేకత ఏంటంటే... చేత్తో పెయింట్ చేసిన కొన్ని వందల చైనీస్ టైల్స్‌ను నేలమీద పరిచారు. వీటిలో ఏ రెండు చిత్రాలూ ఒకేలా ఉండవు. కొన్ని వందల సంవత్సరాలు గడిచినా వీటి మెరుపు కూడా చెక్కుచెదరలేదు.

ఇక్కడున్న బీచ్ చిన్నదైనా అందంగా ఉంటుంది. బీచ్ పక్కన యూరోపియన్ సంస్కృతిని ప్రతిబింబించే పురాతన భవంతులు కనిపిస్తాయి. బ్యాక్ వాటర్స్ పక్కనే ఉన్న చైనీస్ ఫిషర్‌నెట్స్ కొచ్చికే ప్రత్యేకం. చైనాలో తప్ప మరెక్కగా కనిపించని ఈ వలలు ఇక్కడ కనిపిస్తాయి. స్థానికులు వీటితోనే చేపలు పడతారు. సూర్యాస్తమయమయ్యేసరికి పడవలను సముద్రం ఒడ్డుకి తీసుకువచ్చి ఆపుతారు. ఆ సమయంలో సముద్రం అందాన్ని వర్ణించడానికి మాటలు సరిపోవు... సముద్రం, ఆకాశం కలిసినట్లుండే ప్రదేశంలో బంగారు కాంతులతో మెరిసిపోయే సాగరశోభలను చూడాల్సిందే. ఆ సమయంలో సముద్రంలో ఎగిరిపడే డాల్ఫిన్లను చూడడం అపురూప దృశ్యం.

కొచ్చి నగరానికి 6 కిలోమీటర్ల దూరంలో త్రిపునితురలోని సువిశాల మైదానంలో హిల్ ప్యాలెస్ ఉంది. ఇది కొచ్చి మహారాజుల నివాస గృహం. ప్రస్తుతం దీన్ని మ్యూజియంగా మార్చారు. ఇందులో రాజవంశీయుల రథాలు, యుద్ధ సామగ్రి, దుస్తుల వంటివి చూడొచ్చు. ఆ రాజవంశానికి చెందిన రాజా రవివర్మ చిత్రించిన వర్ణచిత్రాలు కూడా ఇక్కడున్నాయి. మనసును కట్టిపడేసేలా, జీవకళ తొణికిసలాడే ఆ చిత్రాలను ఇష్టపడనివారు ఉండరేమో.

సముద్రపు కాలువల్లోని బోల్‌ఘట్టీ అందమైన చిన్న ద్వీపం. ఇక్కడ డచ్‌వారు నిర్మించిన కోట ఉంది. ప్రస్తుతం దీన్ని హోటల్‌గా మార్చారు.


బీచ్‌లో....

త్రిపునితురలో హిల్ ప్యాలెస్

కొచ్చి చుట్టుపక్కల వేగా, ల్యాండ్, డ్రీమ్ వరల్డ్, సిల్వర్ స్టార్మ్, ఫాంటసీ పార్క్ తదితర వాటర్ థీమ్ పార్కులున్నాయి. ఇవన్నీ పిల్లలనే కాదు పెద్దలనూ ఆకట్టుకుంటాయి.

వెనిస్ ఆఫ్ ఇండియా

కొచ్చికి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో అలెప్పీ ఉంది. దీన్ని 'వెనిస్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు. ఇక్కడ వెంబానద్ సరస్సులో నిర్వహించే పడవ పందేలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. కేరళ అందాలను తనివితీరా చూడాలంటే, ఇక్కడి నుంచి కొచ్చికి బ్యాక్ వాటర్స్‌లో పడవ ప్రయాణం చేయాల్సిందే.

తెక్కడిలోని ప్రసిద్ధిగాంచిన పెరియార్ వైల్డ్ లైఫ్ శాంక్చ్యువరీకి కొచ్చి నుండి రోడ్డు మార్గంలో వెళ్లొచ్చు. ఏప్రిల్, మే నెలల్లో ఇక్కడ త్రిసూర్ పూరమ్ ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి.

ఇక్కడికి దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో మున్నార్ హిల్ రిసార్ట్ ఉంది. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో తేయాకు, యాలకుల తోటలు కనిపిస్తాయి. భూమాతకు చిలకపచ్చ చీర కట్టినట్లుండే ఈ ప్రాంతం పర్యాటకుల్ని వేరే లోకంలో విహరిస్తున్నామన్న భ్రమ కలిగిస్తుంది.

సరసమైన ధరలకే....

షాపింగ్ మాల్ ప్రియులకు కొచ్చి కచ్చితంగా నచ్చి తీరుతుంది. పర్యటన గుర్తుగా కొనడానికి ఎన్నో హస్తకళాఖండాలు లభిస్తాయి. కథాకళి మాస్కులు, పడవల వాల్ హ్యాంగింగ్స్, కేరళ సంప్రదాయ చీరలు... ఇలా ఇంకెన్నో వస్తువులు ఆకర్షిస్తాయి. ముఖ్యమైన మరో విశేషమేమంటే ఇక్కడ బంగారు ఆభరణాలు మనం ఊహించనన్ని వెరైటీల్లో దొరుకుతాయి. నాలుగైదు అంతస్తులుగా ఉండే బంగారు షాపులు కనిపిస్తాయి. ఒక్కో అంతస్తులో ఒక్కో రకమైన నగలుంటాయి. ఒక అంతస్తులో రాళ్ల నగలూ, ఒక అంతస్తులో పిల్లలకూ, ఒక అంతస్తులో పెద్దలకీ... ఇలా అన్నమాట.

అక్కడి ఆప్యాయతలు, పండుగలు, సముద్ర గాలులు, కొబ్బరి తోటలు, పడవ షికార్లు, గర్జించే మేఘాలు... అన్నీ పర్యాటకుల మదిలో చెక్కుచెదరని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అందమైన ఆ అనుభూతుల్ని ఎన్నిసార్లు నెమరువేసుకున్నా తనివి తీరదు.

కొచ్చికి వెళ్తే అక్కడి వంటలైన పాలడ ప్రథమన్ (ఒక రకమైన పాల పాయసం), అరటి, పనస చిప్స్, కేరళ హల్వా, ఫళంపురి, అప్పం, ఆడియాపం, కేరళ పరాటాలను తప్పక రుచి చూడాల్సిందే.

కేరళ రాష్ట్రం సుగంధ ద్రవ్యాలకు పెట్టింది పేరు. మిరియాలు, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు, జీడిపప్పు, శొంఠి తదితరాలన్నీ సరసమైన ధరలకు లభిస్తాయి. నాణ్యత కూడా బావుంటుంది.

కొచ్చిలో అందరికీ అందుబాటులో ఉండే హోటళ్లు ఉన్నాయి. హైదరాబాద్ నుండి కొచ్చికి దాదాపు 25 గంటల ప్రయాణం. అక్టోబర్ నుండి మే నెల వరకు పర్యటనకు అనువైన సమయం. అయితే ఓనం, క్రిస్‌మస్ సమయాల్లో వెళ్తే అక్కడి ఆచార వ్యవహారాలు చూడ్డానికి వీలవుతుంది. కేరళవాసుల ఆచారాలు, వేషభాషలు, ఆహారపు అలవాట్లు, పండుగలు భిన్నంగా ఉంటాయి కనక సందర్శకులకు కన్నుల పండుగే.

ఒకప్పుడు అతనో డాన్! 45 కేసుల్లో నిందితుడిగా పోలీసులు వెతుకుతున్న మోస్ట్ వాంటెడ్. దందాలు, కొట్లాటలు, సుపారీలు, తాగుడు, పేకాట.... ఇవే అతనికి తెలిసినవి. అలాంటి వాడు మారాడు. ఎంతగా అంటే...తనలాగా ఏ చిన్నారీ తప్పు దోవ పట్టకూడదనేంతగా. ఆ పట్టుదలతోనే మురికివాడల్లో, రెడ్‌లైట్ ఏరియాల్లోని పిల్లలకు ఫుట్‌బాల్ కోచ్‌గా మారేంతగా.

అఖిలేష్‌ది పేద కుటుంబం. మహారాష్ట్ర నాగ్‌పూర్ మురికివాడల్లో నివాసం. తండ్రి ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్యూన్. తల్లి గృహిణి. ఆరవ తరగతి చదివేటప్పుడు... స్కూల్లో కొందరు మిత్రులు ధారాళంగా డబ్బు ఖర్చు చేయడం, తాగడం, చీట్లపేక ఆడడం గమనించాడు. వాళ్లకు అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో అర్థమయ్యేది కాదా పసివయసులో. కానీ వాళ్లంటే ఒకరకమైన ఆరాధనా భావం ఏర్పడిపోయి... బడి మానేసి దుష్ట బృందంలో కలిసిపోయాడు. తర్వాత నిదానంగా అతనికి అర్థమైంది! వారు దొంగతనాలకు సైతం వెనకాడే రకం కాదని...ఆ పైకంతోనే మజా చేస్తున్నారని. మరో వైపు తమ కుటుంబం కడుపు నిండటానికి తన తండ్రి రోజంతా కష్టడడం నచ్చేది కాదు. నాగ్‌పూర్‌లోని భూవ్యాపారులు, రాజకీయ నాయకుల కోసం పని చేయడం మొదలెట్టాడు. బెదిరించి డబ్బు వసూలు చేయడం అతని పని. నేరాలు చేస్తూ ...కేసుల్లో ఇరుక్కొని పోలీసుల హిట్ లిస్ట్‌లో చేరిపోయాడు.

బంతి తెచ్చిన మార్పు

కొన్నేళ్ల తర్వాత... దురలవాట్లతో జీవితాన్ని నాశనం చేసుకుంటున్న ఈ మిత్రబృందం ఓసారి సామాజిక కార్యకర్త విజయ్ బార్సే కంటపడింది. వారిని పిల్చి 'నాతో ఫుట్‌బాల్ ఆడతారా?' అని అడిగారాయన. డబ్బులిస్తే తప్పకుండా ఆడతా మన్నారు. రోజుకు ఐదు రూపాయలిస్తే ఫుట్‌బాల్ ఆడేట్టు ఒప్పందం కుదుర్చుకున్నారు. పదిహేను రోజులపాటు ఆడాక...పదహారవ రోజున తన దగ్గర డబ్బు లేదన్నారు బార్సే. ఆ ఆటలో వున్న మజాను ఆస్వాదిస్తున్న వారి చేతికి బంతి అందక పోయేసరికి డీలా పడిపోయారు. డబ్బు ఇవ్వకపోయినా సరే. బంతి ఇస్తే చాలనే దశకు చేరుకున్నారు. మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఇదిలా వుండగా.. పోలీసులు గతంలో తన మీదున్న 45 కేసుల విషయమై అఖిలేష్‌ను వెతకసాగారు. దాంతో 20 రోజులపాటు స్థానిక శ్మశానంలో తల దాచుకున్నాడు. అక్కడ బిచ్చగాళ్లు తెచ్చుకున్న ఆహారాన్నీ దొంగిలించి కడుపు నింపుకునే స్థితికి చేరుకున్నాడు. తను ఎవరికోసమైతే తప్పుడు పనులు చేశాడో ... వారిలో ఏ ఒక్కరూ సాయం చేయకపోవడంతో వాస్తవం అర్థమైంది. తన జీవితాన్ని తనే నాశనం చేసుకుంటున్నాడని గ్రహించాడు. బంధుమిత్రుల అండతో ఆ చీకటి జీవితం నుంచి బైటపడాలని నిశ్చయించుకున్నాడు. పోలీసులకు లొంగిపోయాడు. తను మారిన మనిషినని...ఇకపై ఎలాంటి తప్పుడు పనులకు పాల్పడనని ప్రాధేయపడడంతో... పగలు రోడ్ల మీద కనిపించకూడదని రాత్రుళ్లు మాత్రమే బైటికి రావొచ్చని కోర్టు తీర్పు చెప్పింది. సరైన మార్గంలో కుటుంబాన్ని పోషించడమెలాగా అని ఆలోచిస్తున్న తరుణంలో... మన్కాపూర్ బార్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అఖిలేష్‌ను అవకాశం వచ్చింది. అయితే కొద్దిరోజులకే... కోర్టు ఉత్తర్వుల మేరకు ఆ బార్ మూతపడింది. చేతిలో పనిలేక...ఏం చేయాలో తోచక అక్కడే కూలబడిన అతనికి నవ్వుతూ తుళ్లూతూ అటుగా వెళ్తున్న కొందరు చిన్నారులు కనిపించారు. దగ్గర్లో వున్న ఆటస్థలంలో రోజూ ఫుట్‌బాల్ ఆడుకుంటారని తెలుసుకుని... చేజార్చుకున్నదేదో దొరికినంత సంబరపడిపోయాడు అఖిలేష్.తీరా అక్కడికెళ్లి చూస్తే బార్సే సార్ కనిపించాడు. ఇంకేముంది! ఆయన నడుపుతున్న 'స్లమ్ సాకర్'లో తిరిగి ఆటను ప్రారంభించాడు. ఎంతగా అంటే ఆ ఆటే తన ప్రాణంగా భావించి సాధన చేశాడు. చివరికి బార్సే ప్రోద్బలంతో అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు పాల్గొనేంతగా ఎదిగిపోయాడు. 2009లో బ్రెజిల్‌లో పాల్గొన్న భారతీయ ఫుట్‌బాల్ బృందానికి నాయకత్వం కూడా వహించాడు. అక్కడ శక్తిమేరకు ఆడి తోటి క్రీడాకారులను, కోచ్‌లను సైతం ఆకట్టుకున్నాడు. మాంచెస్టర్ యునైటెడ్ కోచ్ 'నీలో కోచ్ లక్షణాలున్నాయి. అటువైపు ఎందుకు ప్రయత్నించకూడదు?' అని ప్రోత్సహించాడు. బ్రెజిల్ నుంచి తిరిగి వచ్చాక ... ఫుట్ బాల్ కోచ్ కావడానికి అవసరమైన కోర్సులన్నీ చేసి నిష్ణాతుడయ్యాడు. తనలాంటి చిన్నారులను సరైన మార్గంలో పెట్టేం దుకు ఫుట్‌బాల్‌ను సాధనంగా చేసుకోవాలను కున్నాడు. నాగ్‌పూర్‌లోని రెడ్‌లైట్ ప్రాంతపు చిన్నారులకు ఆట నేర్పసాగాడు. కానీ అందుకు చాలా కష్టపడాల్సి వస్తోంది. తల్లులు తమ పిల్లలను పంపించడానికి ఆసక్తి చూపకపోవడం...వారు కూడా తమ మార్గంలోనే నడవాలనుకోవడం కూడా అందుకు కారణం.

కుటుంబ మద్దతు

డాన్ నుంచి కోచ్‌గా మారడానికి కుటుంబం నుంచి అందిన మద్దతు, ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. ఇప్పుడు భార్యా, కొడుకుతో ప్రశాంత జీవనాన్ని సాగిస్తున్నాడు అఖిలేష్. తన లాగా తన కుమారుడు కాకూడదని, అతణ్ని మంచి స్కూళ్ల, కాలేజీల్లో చదివించాలన్నది అఖిలేష్ కోరిక. అందుకు ఆర్థికపరమైన ఆటంకాలు ఎదురౌతూనే వున్నాయి. ఎప్పటికప్పుడు ఒక్కొక్కటిగా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాడు ఆశావహంగా.

మార్పు

నిన్నటి డాన్.. నేటి కోచ్..

నేలనెర్రల నుండి ఓ సవ్వడి

మౌనం ఒక నిస్వన సందేశం
మనం నిశ్శబ్దంగా ఎన్నో దృశ్యాలు
మననం చేసుకొంటాం
మన జీవితాల్ని కదిలించినవి
మనం జీవితాల్ని కదిలించినవి
కొన్ని సౌందర్యమైనవి, ఆర్ధ్రమైనవి
దు:ఖకరమైనవి, సంతోషకరమైనవీను
ఎవరో నిరంతరం మనల్ని నిర్బంధిస్తున్నారు
ఊపిరి పీల్చుకోకుండా మన ముక్కు పుటాల్ని
మూస్తున్నారు
బాగ ఎండల్లో ఒక్క సాయంత్రం
ఒకే ఒక తుమ్మెర మనల్ని తాకి వెళుతున్నప్పుడు
మనకు ఒక స్పందన.
ప్రకృతి కూడా మనిషిని నిర్బంధిస్తుంది
సూర్యకిరణాలు ఓజోను పొరను చీల్చుకొని
భూమిని తాకుతున్నప్పుడు నేలనెర్రలిస్తుంది
వృద్ధులు శిశువులు అశువులుబాస్తున్నారు
ప్రకృతి ఒడిలో పెరిగిన బిడ్డలే
ప్రకృతి ప్రకోపానికి బలవుతున్నారు
నిజమే!
చెట్టు వేరు నరుకుతున్నవాడికి
ఇంత ఆలోచన లేదు
నేపాల్‌లో భూకంపం వచ్చిందంటే
'మనకు రాలేదుగా' అనుకుంటున్నారు
భూమికి పేర్లు తెలియవు
భూగోళానికి హద్దులు లేవు
హద్దులు నిర్మించిన చోటంతా
బీటలు వారుతున్నాయి
సరిహద్దుల్లో కవాతులు జరుగుతుండగానే
హద్దులు చెరిగిపోతున్నాయి
ప్రపంచం అంతా అనంతమైన సైన్యాలు
హద్దుకి ఇవతల అహంకార స్వరం
హద్దుకావల స్నేహ హస్తం
ఎవరిని ఎవరు నిలదీస్తున్నారు
ఎవరిని ఎవరు నియంత్రిస్తున్నారు
ఒక ప్రేమ పావురానికి కులం గోడ హద్దు
ఒక జీవన సంస్కృతీ వికాసానికి
అస్పృశ్య భావన ఒక హద్దు
అవును!
మీరు విగ్రహాలను అలంకరించినంత
మనుషులను అలంకరించడం లేదు
మీ కల్మషాన్ని కడగడానికి పూనుకొని
నదులు మురికి ప్రవాహాలవుతున్నాయి
ఇక మంచి నీరు ఎక్కడ? స్వచ్ఛమైన గాలి ఎక్కడ?
నీ ఎదురుగా ఆ చిన్న పిల్ల నృత్యం చేస్తుంది
నీవు సెల్లుల్లో వికృత దృశ్యాలు చూస్తున్నావు
ముక్తి పొందడం కోసం మనం
హిమాలయాల అంచులకు వెళ్ళి
శివలింగాలను తాకి రావాల్సి వుందా
భౌగోళిక దృక్పథంలేని
ఈ యాత్రల వలన ప్రయోజనమేముంది?
మీరు ఇళ్ళను నరకాలను చేసుకున్నాక
స్వర్గం కోసం వెతకడంలో ప్రయోజనమేముంది?
వారి పెదాల చప్పుడు నుండి దుర్గంధం వస్తుంది
వారు అకృత్యాలతో మిమ్మల్ని
మాయాజాలంలో ముంచుతున్నారు
వారు నడి ఎండలో కూడా
మత్తు పానీయాలను సేవిస్తున్నారు
వీరు పీలుస్తున్న గంజాయి దమ్ముకు
మేఘాలు కృత్రిమంగా ఏర్పడతున్నాయి
ఇప్పుడు గుహల్లో సింహాలు లేవు
గుహల్లో నల్ల మందు దాసులు మూలుగుతున్నారు
వారి స్వరాల్లో కూడా హెరాయిన్ మూలుగే
మనిషిని చైతన్య పరిచే జ్ఞానానికి
మీరంతా సజీవ సమాధులు నిర్మిస్తున్నారు
అతడు ఎవరి వెన్నులో పొడిచాడో
వారి విగ్రహాలకు దండ వేస్తున్నాడు
అతడికి అనేక కత్తులు బహూకరిస్తున్నారు
ఇంకా ఎందరినో వధించమని
అతడు పాలించే నేల తరిగే కొలది
అతడి చక్రవర్తిత్వాన్ని ప్రకటిస్తున్నాడు
ఏసీ గదుల్లో కూర్చొని నిమ్మనీరు తాగమని
చెబుతున్నాడు
హద్దులవతల కూర్చుని ఇవతలకి కేకలేస్తున్నారు
ముహూర్తాలు, భూమి పూజల ఆర్భాటాలతో
ఆకలి తీర్చాలని చూస్తున్నాడు
మళ్ళీ ఉక్కపోతగా వుంది
మానవతా స్పృహ తగ్గేకొంది
సూర్యడొక్కడే తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు
ఎన్నో వికృతులు మన ముందు నృత్యం
చేస్తున్నాయి తొలకరి చినుకుల కోసం
భూమి నోరు తెరిచి చూస్తుంది
నేలనెర్రల నుండి ఓ సవ్వడి
ఇదొక నిగమన ఆగమనాల ఘర్షణ.

డా॥ కత్తి పద్మారావు

సూపర్ సిస్టర్స్

మహిళా టెన్నిస్ గ్రాండ్ స్లామ్ చరిత్రలో 'అమెరికన్ సిస్టర్స్' వీనస్ విలియమ్స్, సెరెనా విలియమ్స్ జోడీకి ఓ ప్రత్యేక అధ్యాయమే ఉంటుంది. డబుల్స్‌లో అక్కా చెల్లెళ్ల జంటగా, సింగిల్స్‌లో ఎవరికి వారే సాధించిన విజయాలు, రికార్డులు అపురూపం. అసమానం, నిరుపమానం. పురుషులతో సమాన గుర్తింపు తెచ్చిన ఘనత ఈ నల్ల కలువలకే దక్కుతుంది.

చొప్పరపు కృష్ణారావు
8498084018

జీవితంలో ఎంచుకున్న రంగంలో పైకి రావాలంటే అంతులేని కసి, దీక్ష ఉండి తీరాలి. ఈ రెండు లక్షణాలకు కృషి, అంకిత భావం తోడైతే ఆకాశమే హద్దుగా దూసుకుపోగలమని, తమకంటూ ఓ సరికొత్త చరిత్రను సృష్టించుకోగలమని అమెరికన్ నల్ల కలువలు విలియమ్స్ సిస్టర్స్ వీనస్, సెరెనా పదేపదే చాటుకుంటూ వస్తున్నారు. గత పదహారు సంవత్సరాలుగా ఒకే తీరుగా రాణిస్తూ అపూర్వ విజయాలతో ఆధునిక మహిళా టెన్నిస్‌కే చిరునామాగా నిలిచారు.

పేదరికం నుంచి ప్రపంచ స్థాయికి...

అమెరికా అంటే భూతల స్వర్గం, పేదరికానికి చోటే ఉండదని అనుకుంటే అంతకు మించిన పొరపాటు మరొకటి ఉండదు. ప్రస్తుత మహిళా టెన్నిస్ సూపర్ సిస్టర్స్ వీనస్, సెరెనాల జీవితం... దుర్భర దారిద్ర్యం, అడుగడుగునా అవమానాలు, సమాజంపై ఏదో తెలియని కసితో మొదలై విశ్వ విజేతలుగా ఎదగడం, ప్రపంచ మహిళా టెన్నిస్ ఆల్ టైమ్ గ్రేట్లుగా నిలవడం మనకు కనిపిస్తుంది.

కాలిఫోర్నియాలోని ఓ మురికివాడలో నివసించే ఆఫ్రో-అమెరికన్ కుటుంబంలో జన్మించిన వీనస్, సెరెనాలకు బాల్యం ఓ శాపంలా మారింది. అందరి బాలల్లా పాఠశాలలకు వెళ్లి చదువుకొనే అవకాశమే లేకుండా పోయింది.

ఓ వైపు దుర్భర దారిద్ర్యం, మరో వైపు తండ్రి రిచర్డ్ విలియమ్స్, తల్లి ఆర్సెనీల కీచులాటల మధ్య ఈ అక్కాచెల్లెళ్లు నలిగిపోతూ ఉండేవారు. ఎవరిపైనో ఏదో తెలియని కోపం, చెప్పలేని అసంతృప్తి, అంతులేని ఆగ్రహం. అమెరికా సమాజంలోని శ్వేత జాతికి చెందిన బాలల్లా తామూ ఎందుకు లేమన్న కసి ఈ సూపర్ సిస్టర్స్‌లో లావాలా పెల్లుబికింది. తండ్రి రాబర్ట్ విలియమ్స్ శిక్షణలో రాటుదేలారు. నాజూకుగా ఉండే మహిళా టెన్నిస్‌కు 'పవర్'ను జోడించి జైత్రయాత్ర ప్రారంభించారు. అగ్గి పిడుగుల్లాంటి సర్వీసులు, శక్తిమంతమైన గ్రాండ్ స్ట్రోక్‌లతో వీర విహారం చేశారు.

మహిళా టెన్నిస్ సర్క్యూట్, గ్రాండ్‌స్లామ్ సర్క్యూట్..ఏదైనా సరే విలియమ్స్ సిస్టర్స్‌కు విజయాలు దాసోహమనక తప్పలేదు. వేగంగా ఉండే వింబుల్డన్ పచ్చిక కోర్టులు మందకొడిగా ఉండే ఫ్రెంచ్ ఓపెన్ ఎర్రమట్టి కోర్టులు విపరీతమైన బౌన్స్‌కు మరోపేరైన ఆస్ట్రేలియన్, అమెరికన్ ఓపెన్ హార్ట్ కోర్టుల్లో వీనస్, సెరెనాలకు ఎదురే లేకుండా పోయింది. పురుషులను మించిన వేగంతో శక్తివంతమైన టెన్నిస్ ఆడుతూ... అబ్బురపరచారు.

తండ్రే తొలి గురువు

పేదరికాన్ని జయించాలంటే, భాగ్యవంతులు కావాలంటే ప్రొఫెషనల్ టెన్నిస్‌ను మించిన దారి మరొకటి లేదని రిచర్డ్ విలియమ్స్

చిన్నతనంలో నాన్న రిచర్డ్ విలియమ్స్‌తో....



అమ్మ ఆర్సెనీతో వీనస్, సెరెనా

గ్రహించాడు. టెన్నిస్‌తో తనకు పరిచయం ఉండటంతో శిక్షకుడి అవతారం ఎత్తి తన కుమార్తెలు ఇద్దరి చేతికీ టెన్నిస్ రాకెట్లు ఇచ్చాడు. సాధారణ బాలికలతో పోల్చి చూస్తే తన కుమార్తెల శరీర దారుఢ్యం, శక్తిమంతమైన ఆటతీరుతో ప్రపంచ మహిళా టెన్నిస్‌ను శాసించగలమని నమ్మాడు. దారిద్ర్యం, సమాజంలోని అంతరాల పట్ల తనకున్న ద్వేషాన్ని తన కుమార్తెల్లో కసిని పెంచేలా, విజయాలుగా తీర్చిదిద్దేలా చేశాడు. సిస్టర్స్‌లోని అపార ప్రతిభాపాటవాలను గుర్తించిన స్పాన్సర్లూ అండగా నిలిచారు. ఇంకేముందీ 1994 వీనస్, 1995లో సెరెనా 'టెన్నిస్ ప్రొఫెషనల్స్'గా మారారు. కేవలం ఐదేళ్ల వ్యవధిలోనే తమ జైత్రయాత్ర మొదలు పెట్టారు. గంటకు 206 కిలోమీటర్ల వేగంతో సుడిగాలి లాంటి సర్వీసులు, అగ్గి పిడుగులాంటి గ్రౌండ్ స్ట్రోక్‌లతో 'సిస్టర్స్' విశ్వరూపమే ప్రదర్శించారు.

ఇద్దరూ..ఇద్దరే...

వీనస్, సెరెనా ఆట తీరు, విజయాలతో అక్క వీనస్‌తో పోల్చి చూస్తే చెల్లెలు సెరెనానే అరుదైన ఎన్నో విజయాలు, అసాధారణ రికార్డులు నమోదు చేసింది. గత 17 ఏళ్ల కాలంలో సెరెనా 80కి పైగా డబ్ల్యు.టి.ఎ. టైటిల్స్, 20 గ్రాండ్ స్లామ్ టోర్నీలు నెగ్గి చరిత్ర సృష్టించింది. 33 ఏళ్ల లేటు వయస్సులో ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా ప్రతిభకు వయసుతో ఏ మాత్రం సంబంధం లేదని నిరూపించింది.

ప్రపంచ నెంబర్ వన్ ప్లేయర్‌గా గ్రాండ్ స్లామ్ క్వీన్‌గా నిలిచిన సెరెనా ఖాతాలో ఆరు అమెరికన్, ఆరు ఆస్ట్రేలియన్, ఐదు వింబుల్డన్, మూడు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ ఉన్నాయి. ఒలంపిక్స్ మహిళల సింగిల్స్ బంగారు పతకంతో పాటు అక్క వీనస్‌తో కలిసి డబుల్స్‌లో మరో స్వర్ణ పతకం సాధించిన అరుదైన ఘనత సెరెనాకు మాత్రమే దక్కుతుంది.

మహిళా టెన్నిస్ చరిత్రలో 22 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ సాధించిన స్టెఫీగ్రాఫ్‌ను అధిగమించాలంటే సెరెనా మరో మూడు టైటిల్స్ సాధించాల్సి ఉంది. ప్రస్తుత సీజన్ వింబుల్డన్, అమెరికన్ ఓపెన్లలో సైతం సెరెనానే హాట్ ఫేవరెట్‌గా ఉంది.

ఇక వీనస్ విజయాలకు వస్తే చెల్లెలు సెరెనాకు ఏమాత్రం పోటీ కాదనే చెప్పాలి. 33 ఏళ్ల వయసుల్లో సెరెనా టెన్నిస్‌నే ప్రధాన వ్యాపకంగా చేసుకొంటే ఆరోగ్య కారణాల రీత్యా వీనస్ మాత్రం 'పార్ట్ టైం'గా తన కెరియర్‌ను కొనసాగించాల్సి వచ్చింది. 1995 సీజన్లో ప్రొఫెషనల్ ప్లేయర్‌గా మారిన సెరెనా విలియమ్స్ మహిళా టెన్నిస్ ఆల్ టైమ్ గ్రేట్ ప్లేయర్ల సరసన నిలిచింది. గత రెండు దశాబ్దాల కాలంలో సెరెనా ఆడిన మొత్తం మ్యాచ్‌ల్లో 716 విజయాలు, 121 పరాజయాలు ఉన్నాయంటే ఈ అమెరికన్ బ్లాక్ థండర్ పవర్ ఏ పాటిదో మరి చెప్పాల్సిన పనిలేదు.

20 గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌తో పాటు 6 కోట్ల 96 లక్షల 76 వేల 428 డాలర్ల మొత్తాన్ని ప్రైజ్ మనీ, వ్యాపార ప్రకటనల రూపంలో సంపాదించింది. క్రీడాచరిత్రలో అత్యధికంగా ఆర్జించిన మొదటి 20 మంది మహిళా క్రీడాకారిణుల్లో ఒకరిగా నిలిచింది. నాలుగు భిన్నమైన కోర్టుల్లో జరిగే గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌తో పాటు 2012 లండన్ ఒలంపిక్స్ మహిళల సింగిల్స్ , డబుల్స్ విభాగాలలో డబుల్ గోల్డ్ సాధించిన ఒకే ఒక్క

నెయిల్ టెక్నీషియన్ సెరెనా...

చెల్లెలు సెరెనా 2010లో నెయిల్ టెక్నీషియన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అమెరికన్ ఫుట్‌బాల్ లీగ్‌లో మియామీ డాల్ఫిన్స్ జట్టుకు సహాయ యజమానిగానూ వ్యవహరిస్తోంది. క్రీడా దుస్తులు, పరికరాల బహుళజాతి సంస్థలు ప్యూమా, నైకీల ప్రచారకర్తగా డ్రెస్ డిజైనింగ్ కార్యక్రమాలలో సైతం చురుగ్గా పాల్గొంటోంది. పిల్లల కోసం రూపొందించిన 'హిగ్లే టౌన్ హీరోస్', 'ద సింప్సన్' లాంటి యానిమేటెడ్ కార్యక్రమాల్లోనూ సెరెనా చురుగ్గా పాల్గొంటూ వస్తోంది. టెన్నిస్ ద్వారా సంపాదించిన లక్షలాది డాలర్లతో సిస్టర్స్ తమదైన రంగాలలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తున్నారు.

ప్లేయర్ గౌరవాన్ని సెరెనా సంపాదించింది. సెరెనా సింగిల్స్ విభాగంలో స్పెషలిస్ట్ ప్లేయర్‌గా మాత్రమే కాదు.. అక్క వీనస్ తో కలిసి గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో 13 టైటిల్స్ సంపాదించింది. మహిళా టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్ స్లామ్ సింగిల్స్, డబుల్స్ టైటిల్స్ సాధించిన ఒకే ఒక్క ప్లేయర్ సెరెనా మాత్రమే.

వండర్ వీనస్

ఈ సూపర్ సిస్టర్స్‌లో ఆరడుగుల బుల్లెట్ 34 ఏళ్ల వీనస్ విలియమ్స్ అసాధారణ విజయాలకు శ్రీకారం చుట్టింది. 1995 సీజన్లో ప్రొఫెషనల్‌గా మారిన వీనస్ 21 సంవత్సరాల తన టెన్నిస్ జీవితంలో మహిళల సింగిల్స్‌లో మాత్రమే కాదు, డబుల్స్‌లో సైతం ఎన్నో అరుదైన విజయాలు సాధించింది. మహిళల సింగిల్స్ ఐదు వింబుల్డన్, రెండు అమెరికన్ ఓపెన్ టైటిల్స్ సాధించిన వీనస్ ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీల్లో మాత్రం రన్నరప్ స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2002 సీజన్లో ప్రపంచ మహిళా నెంబర్ వన్ ర్యాంక్ సాధించిన వీనస్ మహిళల సింగిల్స్ స్లామ్ పూర్తి చేసింది.

గ్రాండ్ స్లామ్ డబుల్స్ టోర్నీల్లో ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ,వింబుల్డన్, అమెరికన్ ఓపెన్ నాలుగు విభాగా లలోనూ సెరెనాతో కలిసి విజేతగా నిలిచి ంది. మొత్తం పద మూడు గ్రాండ్ స్లామ్ డబుల్స్ సాధించిన ప్లేయర్ గా గుర్తి ంపు తెచ్చుకుంది.

గోల్డెన్ క్వీన్

2000 సిడ్నీ ఒలంపిక్స్, 2008 బీజింగ్ ఒలంపిక్స్, 2012 లండన్ ఒలంపిక్స్ మహిళల డబుల్స్‌లో అమెరికాకు బంగారు పతకాలు

సాధించిన అసాధారణ రికార్డు విలియమ్స్ సిస్టర్స్‌కు మాత్రమే దక్కుతుంది. గ్రాండ్ స్లామ్ డబుల్స్‌తో పాటు ఒలంపిక్స్ బంగారు పతకాలతో మహిళా డబుల్స్ చరిత్రలోనే గోల్డెన్ స్లామ్ పూర్తి చేసిన సూపర్ సిస్టర్స్‌గా వీనస్, సెరెనా జోడి నిలిచింది. 34 ఏళ్ల వయసులో సైతం టెన్నిస్ ప్లేయర్‌గా కొనసాగుతున్న వీనస్ ప్రస్తుతం మహిళల సింగిల్స్‌లో 16వ ర్యాంక్ ప్లేయర్‌గా పోటీల్లో అడపాదడపా పాల్గొంటూ వస్తోంది. టెన్నిస్ ప్లేయర్‌గా ఇప్పటి వరకూ 46 సింగిల్స్ టైటిల్స్, 21 డబుల్స్ టైటిల్స్ సాధించిన వీనస్ 30 లక్షల 59 వేల 536 డాలర్ల ప్రైజ్ మనీ ఎండార్స్ మెంట్ల ద్వారా సంపాదించింది. మహిళల టెన్నిస్ టీమ్ విజేతలకు ఇచ్చే ఫెడరేషన్ కప్‌ను 1999లో అమెరికాకు అందించిన వీనస్.. మిక్స్‌డ్ టెన్నిస్ టోర్నీ హాప్‌మన్ కప్‌లో మాత్రం రన్నరప్ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

సెరెనా వారెవా!

మహిళా టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్ స్లామ్ సింగిల్స్, డబుల్స్ టైటిల్స్ సాధించిన ఒకే ఒక్క ప్లేయర్, గ్రాండ్ స్లామ్ నాలుగు టోర్నీల్లోనూ 50కి పైగా విజయాలు నమోదు చేసిన సెరెనా. ఒలంపిక్స్ చరిత్రలో నాలుగు బంగారు పతకాలు సాధించిన ఏకైక టెన్నిస్ ప్లేయర్ సెరెనా. 2012 లండన్ ఒలంపిక్స్‌లో సింగిల్స్, డబుల్స్ విభాగాలలో స్వర్ణ పతకాలు సాధించిన తొలి ప్లేయర్. సోదరి వీనస్‌తో కలిసి13 గ్రాండ్ స్లామ్ డబుల్స్ టైటిల్స్ సొంతం చేసుకున్న ప్లేయర్ సెరెనా. మహిళా టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ కాలం ఆధిపత్యం చెలాయించిన ఒకే ఒక్క ప్లేయర్. మహిళల సింగిల్స్ డబుల్స్ విభాగాలలో 33 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ నెగ్గిన సెరెనా.

విమర్శలూ లేకపోలేదు

గత 15 సంవత్సరాల కాలంలో ఈ అమెరికన్ నల్ల కలువలు సాధించిన విజయం. గెలుచుకోని టైటిల్ అంటూ లేదు. గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నుంచి ఒలంపిక్స్ సింగిల్స్, డబుల్స్ బంగారు పతకాలు సిస్టర్స్'కు పాదాక్రాంతమవుతూ వచ్చాయి. మహిళల డబుల్స్‌లో జంటగా, సింగిల్స్‌లో ఎవరికి వారుగా పాల్గొంటూ తిరుగులేని విజయాలతో మహిళా టెన్నిస్ అంటే తామే అన్నట్లుగా ఆధిపత్యం చెలాయించారు. అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ ఫైనల్స్

ఫ్యాషన్ ప్రపంచంలోకి...

పేదరికం, టెన్నిస్ కెరియర్ కారణంగా తమకు దూరమైన చదువును ఏదో ఒక రూపంలో పొందాలన్న లక్ష్యంతో సిస్టర్స్ ఇద్దరూ ఫ్యాషన్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలను ఎంచుకున్నారు. అక్క వీనస్‌కు ఫ్యాషన్ డిజైనింగ్ అంటే ఎంతో మక్కువ. ఫోర్ట్ లాడర్‌డెల్ ఆర్ట్స్ అకాడమీ నుంచి దూరవిద్య ద్వారా ఫ్యాషన్ డిజైనింగ్‌లో అసోసియేట్ డిగ్రీ సంపాదించింది. ప్రస్తుతం వీస్టార్ ఇంటీరియర్స్ సంస్థకు సీఈవోగా వీనస్ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. 2001 సంవత్సరం లోనే ప్రపంచంలోని 30 మంది శక్తిమంతమైన మహిళల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంది.

చేరడం, నీకొక టైటిల్, నాకొక టైటిల్ అంటూ నెగ్గుకు రావడం సాధారణ విషయంగా మారింది.

ఫైనల్స్ ప్రారంభానికి ముందే సెరెనా, వీనస్ ప్రత్యర్థులుగా తలపడుతున్న సమయంలో ఎవరు విజేత కావాలో వారి తండ్రి రాబర్ట్ విలియమ్స్ నిర్ణయించేవారని, అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ లాలూచీపడి మ్యాచ్‌లు ఆడేవారని, కావాలనే ఒకరి చేతిలో ఒకరు ఓడిపోతూ వచ్చే వారన్న విమర్శలు ఒక దశలో మహిళా టెన్నిస్‌ను కుదిపేశాయి. విలియమ్స్ సిస్టర్స్ పురుషులను మించిన పవర్ టెన్నిస్ ఆడతున్నారని మహిళా టెన్నిస్ మనుగడే ప్రశ్నార్థకమై పోయిందంటూ కొంతకాలం ఆందోళన సైతం చెలరేగింది. కానీ నల్ల జాతికి చెందిన తమ ఎదుగుదలను, ఆధిపత్యాన్ని సహించలేక శ్వేతజాతి సమాజం ఇలాంటి విమర్శలు చేయటాన్ని వారి సంస్కారానికే విడిచి పెడుతున్నామంటూ తెలివిగా సమాధానమిచ్చింది విలియమ్స్ కుటుంబం.

ఆటుపోట్లు, విమర్శలు ఎన్ని ఎదురైనా ఈ సూపర్ సిస్టర్స్ తమ విజయ పరంపరను 15 ఏళ్ళుగా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇద్దరూ కలిసి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో 40 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను, 150కు పైగా డబ్ల్యుటీఏ టైటిల్స్, 1500 కోట్ల రూపాయలకు పైగా ప్రైజ్‌మనీ, ఒలంపిక్స్ సింగిల్స్, డబుల్స్‌లో నాలుగు బంగారు పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. ప్రపంచ మహిళా టెన్నిస్ చరిత్రలోనే తమకంటూ ఓ అధ్యాయాన్ని సృష్టించుకున్నారు.

అక్కను మించిన చెల్లెలు...

అపురూపమైన బాల్యాన్ని, అంతకు మించిన చదువును పక్కన పెట్టి టెన్నిస్ ఆటే జీవితంగా, ఊపిరిగా ఈ సూపర్ సిస్టర్స్ ప్రపంచ టెన్నిస్‌లో సాధించని విజయం, అధిరోహించని శిఖరం అంటూ ఏదీ లేదు. 34 ఏళ్ల వయసులో వీనస్ టెన్నిస్ కెరియర్‌ను కేవలం ఓ పార్ట్‌టైమ్ జాబ్‌గా పరిగణిస్తూ... ప్రస్తుతం సింగిల్స్ 16వ ర్యాంకులో కొనసాగుతోంది. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో మొత్తం 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్, ఒలింపిక్స్ డబుల్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన వీనస్ టెన్నిస్ జీవితం దాదాపు ముగింపు దశకు వచ్చింది.

అక్క వీనస్‌తో పోల్చి చూస్తే చెల్లెలు సెరెనా 33 ఏళ్ల వయసులోను దూకుడు కొనసాగిస్తోంది. ప్రపంచ నెంబర్ వన్ ప్లేయర్‌గా తన ఆధిపత్యం చెలాయిస్తోంది. 2015 ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో గ్రాండ్ సింగిల్స్ విజయాలను 20కు పెంచుకుంది. ప్రస్తుత సీజన్లో మిగిలిన వింబుల్డన్, అమెరికన్ ఓపెన్ టైటిల్సూ నెగ్గితే స్టెఫీగ్రాఫ్ పేరుతో ఉన్న 22 టైటిల్స్ ఆల్‌టైమ్ రికార్డును సమం చేసే అవకాశం ఉంది.

ప్రపంచ మహిళా టెన్నిస్ పుస్తకంలో తమకంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న వీనస్, సెరెనా జీవితం నవతరానికి, సమాజంలోని అట్టడుగు వర్గాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుంది.

కెన్యాలోని పాఠశాల విద్యార్థులతో సెరెనా

సేవా కార్యక్రమాలు

విలియమ్స్ సిస్టర్స్ తాము సంపాదించిన వందల కోట్ల రూపాయల్లో కొంత మొత్తాన్ని ఓ ట్రస్టు ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. వీనస్ కంటే సెరెనానే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది.

తమ పూర్వీకులకు చెందిన ఆఫ్రికా ఖండ దేశాలపై సెరెనా దృష్టి పెట్టింది. కెన్యాలో తన పేరుతో ఓ పాఠశాలను ఏర్పాటు చేసి పేద వర్గాల బాలలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తోంది. మహిళల్లో స్ఫూర్తిని పెంచేలా, ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెంచుకునేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బ్రెస్ట్ కేన్సర్ కార్యక్రమాలకు ప్రచారకర్తగా సెరెనా వ్యవహరిస్తోంది. ఐక్యరాజ్య సమితి నిర్వహించే గ్లోబల్ కార్యక్రమాలలోనూ సెరెనా తన వంతు పాత్ర నిర్వహిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో అతలాకుతలమైన మానవాళిని ఆదుకోవడానికి మహిళా టెన్నిస్ సమాఖ్య నిర్వహించే సహాయక టెన్నిస్ పోటీల్లో పాల్గొంటూ నిధులు అందజేస్తోంది. కాలిఫోర్నియాలోని మురికివాడల నుంచి వచ్చి పేదరికంతో పాటు ప్రపంచ మహిళా టెన్నిస్‌నే జయించి జగజ్జేతలుగా నిలిచిన ఈ అపూర్వ సోదరీమణులను 'సూపర్ సిస్టర్స్' అనక మరేమనాలి.

ఉసురు

- జి.ఎస్.కె. కరీముల్లా
9966757407.

"ముసురు పట్టిన వానలా ముసల్ది ఏడ్చింది ఏడ్చినట్లే ఉంది. దూరంగా కానుగ చెట్టు క్రింద కూర్చుని సీతమ్మోరిలా కంటికి, మంటికి ఏకధారగా ఏడుస్తూనే ఉంది. కారే కంటికి, చీదే ముక్కుకి తెరిపి లేకుండా పోయింది.

రెండ్రోజులుగా ముసల్దానిదిదే తంతు. నేనెంత సముదాయించినా విన్లేదు. ముసల్దాన్ని ఓదార్చడం ఎవరి తరం కావట్లేదు.

క్లాసులోంచి ఏడుస్తున్న ముసల్దాన్ని చూస్తున్నాను. ఏవో ఆలోచన్లు ముసురుకున్నాయి.

పదేళ్ళ నాటి మాట.నేను బడికి వచ్చినప్పటి నుండి ముసల్ది బళ్ళో పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెడుతుంది. అంతకు ముందు ఎవరెవరో ఉన్నారు గాని ఒక్కళ్ళూ నిలకడగా ఉండి వండింది లేదు.

కూరకెంత? నారకెంత? ఉప్పుకెంత? పప్పు కెంత? గవర్మెంటోళ్ళు పిల్లోనికి ఇస్తున్న దెంత? ఖర్చు లన్ని పోనూ మిగుల్తు న్నదెంత? అంటూ లెక్కలేసుకుని కూలిపాటు కూడా దక్కకపోవడంతో మేం చేయమంటే... మేం చేయం అని ఒక్కొక్కరే మానుకున్నారు.

పిల్లలకు మధ్యాహ్నం పస్తులు తప్పలేదు.కొత్త ఏజెన్సీ ఏర్పాటు చేయాలని నాపై అధికారుల ఒత్తిడి. ఊర్లో ఎవర్నడిగినా కూలి కెళ్తే మూడొందలి దస్తున్నారు. పెట్టుబడి లేని వ్యాపారం. అది మాకు గిట్టదు లెండి మాష్టారూ... అంటూ ఎవరూ రానన్నారు.

నాకేం చేయాలో పాలుపోలేదు.సరిగ్గా ఆ పరిస్థితుల్లో ముసల్ది నేనొండిపెడతానంటూ ముందుకొచ్చింది.

"పిల్లలు పస్తులుంటే కడుపు తరుక్కుపోతుంది.

పసిపిల్లలు దేవుస్తో సమానం అంటారుగా. దేవుడికి నైవేద్యం పెడ్తా నాకేమొస్తుందని లెక్కలేసుకుంటామా? పసిపిల్లలకు అన్నం వండి పెట్టడం కన్నా మంచి పని ఏముంటుంది? వాళ్ళ ఆకలి తీర్చడం కన్నా పుణ్యం ఏముంటుంది? కడుపుకు పెట్టే దానికాడ లాభనష్టాల లెక్కలేస్కుంటే ఎలా? నేనొండిపెడతానయ్యావారు."

ముసల్దాని మాటలకు నా సంతోషానికి మేర లేకుండా పోయింది. ఆ క్షణం ముసల్ది నా కంటికి నన్ను, పిల్లల్ని ఆదుకోవడానికొచ్చిన అమ్మవారిలా కన్పించింది. అదుగో అప్పటి నుండి ముసల్దే పిల్లలకు అన్నం వండి పెడుతుంది.

ముసల్ది అని ఊరంతా పిలిచే ముసల్దాని పేరేంటో ఎవరికీ తెలీదు. కాని అందరు ముసల్ది అనే పిలుస్తారు. అసలు ముసల్దానిదీ వూరు కాదు. ఎక్కడో కనిగిరి దగ్గర కొండరాయుడి పల్లె. పెళ్ళై పదేళ్ళైనా పిల్లలు పుట్టలేదని పెనిమిటి ఇంకో మనువాడితే కోపంతో వాణ్ణి, ఇంటిని వదిలి ముప్పై ఏళ్ళ క్రితం ఈ ఊరొచ్చింది. బడి ప్రక్కనే చిన్న గుడిసె వేసుకొని చిన్నా చితక పన్చేసుకుంటూ బతుకు వెళ్ళదీస్తుంది.

వంట చేయడంలో ముసల్ది నలభీముడికి అమ్మమ్మే! తన హస్తవాసి అలాంటిది. వంట చేసిపెట్టడం ఓ పనిలా ఏనాడు భావించలేదు ముసల్ది. పరమభక్తురాలు భగవంతుడికి భక్తితో నైవేద్యం పెట్టినట్లు పిల్లల పట్ల ప్రేమతో ఇష్టంగా వండి పెట్టేది. లాభ నష్టాల లెక్కల్తో పన్లేకుండా ఎక్కడా రాజీ పడకుండా వండేది. ఇంటి భోజనాన్ని మరిపించేది.

సాంబారు పెడితే ఆ ఘుమఘుమలు బడి మొత్తం ఘుమాయించేవి. పిల్లల బొజ్జల్లో జఠరాగ్ని

ఉవ్వెత్తున ఎగసేది. ఆ చేత పులిహోర కలిపితే అది రాములోరి గుళ్ళో ప్రసాదంలానే ఉండేది. అంత రుచిగా వండేది.

మధ్యాహ్నం అయ్యిందంటే చాలు పిల్లలు ఆవురావురుమనేవాళ్ళు. కొసరి కొసరి వడ్డించేది. అప్పుడు చూడాలి. ముసల్దాన్ని నెత్తిన ముగ్గు బుట్ట లాంటి జుట్టు, నుదుట రూపాయి కాసంత బొట్టు, రెండు చేతులా నిండుగా గాజుల్తో సాక్షాత్తూ కాశీలోని అన్నపూర్ణ తల్లిలానే కన్పించేది ముసల్ది.

"తినండ్రా... తినండి... ఒక్క మెతుకు మిగలకుండా ముందు తిన్నోళ్ళు రాజన్నమాట."తన కడుపున పుట్టిన బిడ్డల్ని బతిమాల్తున్నట్లు బతిమాల్తు పిల్లల చేత తినిపించేది. ఆ చేతి మహత్యమేమోగాని పళ్ళెంలో ఒక్క మెతుకు మిగల్చకుండా తినేవాళ్ళు పిల్లలు. ఆ క్షణం ముసల్ది రాముని ఆకలి తీరుస్తున్న శబరిలానే కన్పించేది. పిల్లలు తింటే ముసల్దాని కడుపు నిండిపోయేది.

ఇంత చేసినా నెల చివర ఖర్చులు, రాబడి చూస్తే ముసల్దానికి మిగిలేది అంతంత మాత్రమే. పాపం కూలీపాటు కూడా మిగల్లేదుగా అంటే 'పోన్లేయ్యా!.... ఒంటి ముండని మిగిల్నా నేనేం చేసుకుంటాను' అనేది.

ఒక్కోసారి ఆ కొద్దిపాటి కూడా మిగలక నష్టం వస్తే 'పసి బిడ్డలకేగా పెట్టింది.. మిగలకపోతే మాన్లే.. పోతూ కట్టుకు పోయేదేముంది' అనేది.పనైపోయినా బడొదిలి ఇంటికెళ్ళేది కాదు ముసల్ది. బళ్ళోనే తిరుగుతూ పిల్లల్తో గడిపేది. తనకు పిల్లలు లేకపోవడం వలన ఏమో గాని ముసల్దానికి పిల్లలంటే అంత ఆపేక్ష. పిల్లలు కూడా ముసల్దంటే అంతే ప్రేమ కనబర్చేవారు.

రోజులుసాఫీగా గడిచిపోతున్నాయి. నాలుగు నెళ్ళ క్రితం రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. పాత ప్రభుత్వం పోయి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చాలా కాలంగా అధికారానికి దూరంగా ఉన్నారేమో అధికారంలోకి రాగానే ఆ పార్టీ మనుషులకు అడ్డు లేకుండా పోయింది. అన్నీ మాకే కావాలన్నారు. అనుకున్నదే తడవుగా ఊర్లో రేషన్ డీలర్ నుండి అంగన్‌వాడీ దాకా అప్పటిదాకా ఉన్నవాళ్ళను తీసేసి తమ పార్టీ వాళ్ళకు అప్పగించారు.

ఇప్పుడు గ్రామాల్లో ఇదో ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలో వాళ్ళ కన్ను బళ్ళో మధ్యాహ్న భోజన పథకంపై పడింది. 'మొదట్లోలా కాకుండా ఇప్పుడు ప్రభుత్వం ప్రతి పిల్లాడికి బానే ఇస్తోంది. ప్రస్తుత రేట్ల మీద బాగానే గిట్టుబాటవుతుంది. ఏ లాభం లేకపోతే ముసల్ది అన్నేళ్ళుగా ఎలా చేస్తుంది?' అనుకుని ఏజెన్సీని తమ వాళ్ళకు ఇప్పించాలనుకున్నారు.

స్కూలుకొచ్చి నన్ను కలిసి ఏజెన్సీ మార్చాలన్నారు."ముసల్ది ఏ రాజకీయ పార్టీకి చెందని మనిషి. గిట్టుబాటు కాక వండిపెట్టడానికి ఎవరూ ముందుకు రాక పథకం ఆగిపోయిన పరిస్థితుల్లో పాపం ముసల్దే ముందుకొచ్చి పిల్లలకు అన్నం వండి పెడుతోంది. ఇప్పుడు ముసల్దాన్ని తీయడ మెందుకు?"

నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. విన్లేదు. మార్చాల్సిందేనని పట్టుపట్టారు. అంతటితో ఆగక స్థానిక యం.యల్.ఎ. చేత పై అధికారులకు ఫ్యాక్స్/సిఫారసు చేయించారు. ఏజెన్సీ వాళ్ళు చెప్పిన వాళ్ళకిమ్మని అధికారులు నన్నాదేశించారు.

చేసేది లేక మరుసటి రోజు ముసల్దాన్ని పిలిచి విషయం చెప్పాను. ముసల్ది అనిమిష మాత్రంగా నన్నలాగే చూస్తుండి పోయింది.

తేరుకున్న ముసల్ది "ఇదెక్కడి న్యాయమయ్యా! గిట్టుబాటు కాదని ఒక్కరూ ముందుకు రాకపోతే కష్టమో, నష్టమో ఇన్నాళ్ళుగా వండిపెడుతున్నాను. ఇప్పటిదాకా ఈ పనికి అలవాటు పడ్డాను. ఇప్పుడీ వయసులో ఇంకో పని చేసుకోలేను. తీసేస్తామంటే ఎలా అయ్యవారు? అదీగాక పిల్లల్తో నాకు తెలీకుండా మాలిమయ్యాను... వచ్చే రాబడి మాట అటుంచితే కడుపు తీపి అంటే ఏంటో తెలిసింది... పిల్లల్లేరని నా పెనిమిటి నన్ను కాదన్నా దేవుడు ఇంతమంది పిల్లల్ని నాకిచ్చాడనుకున్నా... పిల్లల్నొదిలి వెళ్ళమంటే నా వల్ల కాదయ్యా" అంటూ కన్నీటి పర్యంతమైంది.

ముసల్దాన్ని చూడగానే నాకు దుఃఖం తన్నుకొచ్చింది. ఎట్లానో దిగమింగుకున్నాను. కళ్ళలోంచి జారిన కన్నీటి బొట్లను ముసల్దానికి కన్పించకుండా కర్చీఫ్‌తో తుడుచుకున్నా.

"నిన్ను తీయాలని నాకేం లేదు. ఈ విషయంలో నేను నిమిత్తమాత్రుణ్ణి. పైనుంచి ఒత్తిడులు అలా ఉన్నాయి. నన్ను క్షమించు."

గొంతు గద్గదం కాగా ఎలాగో గొంతు పెగల్చుకుని చెప్పాను.ముసల్ది విన్లేదు. వినకపోగా కోపంగా "ఎలా తీసేస్తారో... ఎవరొచ్చి తీసేస్తారో నేను చూస్తా. నేను మానేస్తున్నట్లు సంతకం పెట్టకుండా ఇంకోళ్ళకు ఎట్లా ఇస్తారో చూస్తా" అంటూ కరాఖండిగా చెప్పి వెళ్ళిపోయింది.

నిజమే! మానేస్తున్నట్లు ముసల్ది సంతకం పెట్టకుండా కొత్తవాళ్ళకు ఏజెన్సీ ఇవ్వడం సాంకేతికంగా సాధ్యం కాదు.

ఇదే విషయం పై అధికార్లకు చెప్పాను.అలా అయితే రేపు ఎంక్వైరి వేసి తీసేద్దాం. వాళ్ళ మనుషుల చేత సరిగా అన్నం వండి పెట్టడదం లేదని, సంతకాలు తీసుకుందాం. ఆనక పాత ఏజెన్సీని మనమే రద్దుచేసి కొత్త ఏజెన్సీ పెడదాం.

అధికార్ల మాటలకు నేను నివ్వెర పోయాను. దారుణమన్పించింది. హత్య కన్నా మహాపాతకమన్పించింది.

ఆఖరి ప్రయత్నంగా ముసల్దానికి నచ్చచెప్పా లనుకున్నా. "సంతకం పెట్టకపోతే నువ్వు సరిగా వండట్లేదని చెప్పి బలవంతంగా తీసేస్తారు. దానికంటే స్వచ్ఛందంగా తొలగిపోవడమే మర్యాద." అని చెప్పాను.

ముసల్ది ససేమిరా అంది. "నేనెట్లా వండానో తిన్న పసిబిడ్డలకు తెల్సు... చూసిన మీకు తెల్సు. పైన దేవుడనే వాడొకడున్నాడు... నేను సరిగా వండలేదని చెప్పడానికి నోరెలా వస్తుందో చూస్తా" అంది ముసల్ది.

"అయ్యో! దేవుడనే వాడుంటే ఈ అరాచకాలు జరుగుతాయా!" అనుకున్నాను.

ముసల్ది ఏడుస్తూనే ఉంది. మధ్యాహ్నానికి

అధికార్లు ఎంక్వైరీకి వచ్చారు.ముసల్ది అధికార్ల కాళ్ళా, వేళ్ళ పడుతూ పరిపరి విధాలుగా బతిమాల్తోంది.

"మీకు దణ్ణం పెడతానయ్యా... నా కడుపు కొట్టమాకండి... ముసల్దాన్ని కనికరించండి... ఈ వయసులో ఇంకో పని చేసుకోలేను... మీ కాళ్ళు పట్టుకుంటా... పిల్లల్నొదిలి నేను బతకలేనయ్యా... పిల్లల నుంచి నన్ను దూరం చేయకండయ్యా..."

ఎవరో చేత్తో గుండెను నులిమినట్లు విలవిలలాడిపోయాను. ఆ దృశ్యాన్ని చూసి అధికార్లు ముసల్దాని మొరనాలకించలేదు.అటెండరు ముసల్దాన్ని రెక్కపట్టుకుని తీస్కెళ్ళి దూరంగా కూర్చోబెట్టాడు.

ఎంక్వయిరీ మొదలైంది.అన్నం సరిగా వండటం లేదని, సాంబారు నీళ్ళలా ఉంటుందని, గుడ్డు ఇవ్వడం లేదని వాళ్ళు ముసల్దానిపై లేనిపోని ఆరోపణలు చేశారు. సంతకాలు సేకరించి రాతపూర్వకంగా అధికార్లకు అందచేశారు.

అధికార్లు ఆ ఆరోపణలను బహిరంగంగా చదివి విన్పించారు.అవి విన్న ముసల్ది ఖిన్నురాలైంది. చేష్టలుడిగి అలాగే చూస్తుండి పోయింది.

ఆ తరువాత అధికార్లు పాఠశాల కమిటీ ద్వారా పాత ఏజెన్సీని తొలగిస్తూ, కొత్త ఏజెన్సీని నియమిస్తూ సంతకాలు సేకరించి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

అంతా క్షణాల్లో జరిగిపోయింది.నేను కొయ్య బొమ్మలా నిల్చుండిపోయి చూస్తున్నాను.నా సంతకం పెట్టమన్నారు. అన్యాయం అంటూ నా అంతరాత్మ గొంతు చించుకు అరుస్తోంది. న్యాయానికి, భయానికి మధ్య క్షణకాలం అంతులేని మానసిక సంఘర్షణ. చివరికి భయమే గెల్చింది. అరవకుండా నా అంతరాత్మ నోరు నొక్కాను. మారు మాట్లాడకుండా సంతకం పెట్టాను. నా సంతకంతో ముసల్దాని బతుకు మీద దెబ్బకొట్టాను.ముసల్దాని వైపు చూశాను. తనిప్పుడు ఏడ్వడంలేదు. గంభీరంగా మారిపోయింది. నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చింది. అందర్నీ ఒక్కసారి కలియచూసింది.

"నాల్గు మెతుకులు పెడితే కుక్క బతికినంత కాలం విశ్వాసం చూపిస్తుంది. ఇన్నేళ్ళుగా మీ బిడ్డల ఆకలి తీర్చాను. అందుకు నాకు బాగానే చేశారు. మీ అధికారంతో, బలగంతో ఒంటరి ముసల్దాని బతుకు మీద దెబ్బకొట్టారు. ఈ అరాచకం చూడటానికేనా దేవుడు నన్నింకా తీసుకుపోలేదు... మీకు నేనడ్డు రాను... మీరే చేసుకోండి... అంతా మీరే ఏలుకోండి."

రెండు చేతులు జోడించి అందరికి దణ్ణం పెట్టింది. ఒక్కసారి బడంతా కలియచూసి కౌరవుల మోసానికి ఓడిపోయిన ధర్మరాజులా నెమ్మదిగా నడుచుకుంటూ ముసల్ది అక్కణ్నుంచి నిష్క్రమించింది.

అందరూ వెళ్ళిపోయారు.నా కళ్ళలో ముసల్దే కన్పిస్తోంది. ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. ముసల్ది అమ్మోరికి బలిచ్చిన మేకపోతులా అన్పించింది. అన్యమనస్కంగానే మరిసటి రోజు స్కూలుకొచ్చాను.

ఎవరో వచ్చి చెప్పారు. ముసల్ది రాత్రి దిగుల్తో నిద్దట్లోనే చచ్చిపోయింది.ఓ క్షణం నాకు నోట మాట రాలేదు. కుర్చీలో కుప్పకూలిపోయాను.దుఃఖం లావాలా తన్నుకొచ్చింది. చిన్నపిల్లాడిలా రోదించాను. అలా ఎంతసేపు ఏడ్చానో నాకే తెలీదు. చాలాసేపటికి గానీ మనిషిని కాలేకపోయాను.

అందరం కల్సి ముసల్దాని ఉసురు తీశామన్పించింది.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది ఎవరో నేత టీవీలో గొంతు చించుకుంటున్నాడు. నవ్వొస్తోంది... సిగ్గేస్తోంది... అసహ్యమేస్తోంది. ✦

బ్లాగిస్తానుడు

బ్లాగ్ జీవులకు సుపరిచితమైన పేరు టంబ్లర్. చాలా తేలిగ్గా బ్లాగ్‌లను నిర్వహించే వీలున్న ఈ వెబ్‌సైట్‌ను వాడుతున్నవారు 23 కోట్ల మంది వరకు ఉన్నారు. కొన్ని కోట్ల పోస్టులు రోజూ పుట్టుకొచ్చే ఈ సైట్ వెనుక ఉంది ఓ యువకుడు. 20 ఏళ్లకే దీనికి ప్రాణం పోసిన అతడి పేరు డేవిడ్ కార్ప్.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో పెరిగి పెద్దవాడైన డేవిడ్ కార్ప్ తల్లిదండ్రులు బార్బరా యాక్కెర్‌మన్, మైకేల్ కార్ప్ టీచర్, టీవీ కంపోజర్‌లు. చిన్నప్పటి నుంచి మంచి తెలివితేటల్ని ప్రదర్శిస్తోన్న కార్ప్ ఇష్టానుసారం వారు అతణ్ని పెంచారు. బడి చదువుల్లో ముందున్నా వాటి కంటే స్వయంగా నేర్చుకోవడానికే ప్రాముఖ్యతనిచ్చాడు డేవిడ్. తల్లి టీచర్‌గా చేస్తున్న కల్‌హాన్ పాఠశాలలో 8వ తరగతి వరకు చదివిన కార్ప్‌కు కంప్యూటర్‌పై మోజు పెరిగింది. ఆ వయసుకే వెబ్‌సైట్లను తయారుచేయడంలో మంచి పట్టు సాధించాడు. వాటిని నేర్పుగా తయారు చేసి అమ్మడం ప్రారంభించాడు. ఇందులో అభివృద్ధి కనిపించడంతో బడిని వదిలేశాడు. పూర్తిగా వెబ్‌సైట్ల సృష్టికే అంకితమయ్యాడు. అవసరమైన చదువును లీగ్ యూనివర్సిటీల ద్వారా చదివాడు. అతడికి 14 ఏళ్ల వయసున్నపుడే చాలా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఇంటర్న్‌గా పనిచేశాడు. అనూహ్యమైన మలుపు ఈ సందర్భంలో తిరిగింది. అర్బన్ బేబీ అనే పేరెంటింగ్ కంపెనీ తమ వ్యాపారానికి వెబ్‌సైట్‌ను రూపొందించమని అడిగింది. దాన్ని చాలా చక్కగా చేయడంతో అతడినే దానికి అధినేతను చేసిందా కంపెనీ. ఆ తర్వాత మెరుగైన అవకాశాలను వెతుక్కుంటూ టోక్యో చేరుకున్నాడతడు. అక్కడ డేవిడ్‌విల్లే అనే కన్సల్టింగ్ కంపెనీ పెట్టాడు. అక్కడ పరిచయమైన మార్కో ఆర్మెంట్ అనే ఇంజినీర్‌తో కొన్ని నెలల్లోనే టంబ్‌లర్‌కు ఓ రూపం తీసుకువచ్చాడు. ప్రపంచానికి తమ భావాలను వ్యక్తపరిచేందుకు ఓ వెబ్‌సైట్ కావాలని అర్థం చేసుకున్న వీరు ఈ కొత్త తరహా బ్లాగింగ్ సోషల్ నెట్‌వర్క్‌కు ప్రాణం పోశారు. అప్పుడు డేవిడ్ వయసు 20 ఏళ్లు. వారు ఊహించినట్టుగానే రెండు వారాల్లో అందులో 75 వేల మంది రిజిష్టరయ్యారు. అలా కొన్ని నెలల్లోనే ఖండాతరాలను దాటేసి కోట్ల మందితో బ్లాగింగ్ వ్యవస్థను రూపొందించింది. దీనిలోని ఫీచర్లే ఈ సైట్ విజయ రహస్యం. చాలా సులువుగా పోస్ట్‌లను చేయడం. ఇతర బ్లాగర్ల పోస్టులను షేర్ చేసే అవకాశం ఉండటం. డ్యాష్‌బోర్డ్‌లో మరిన్ని ఫీచర్లతో వీడియోలు, ఫొటోలు, కామెంట్‌లు వంటి వాటిని పొందికగా అమర్చుకోవడం, పంచుకోవడం చాలా తేలిక. ఆకట్టుకునే విధంగా పేజీ డిజైన్ ఉంటుంది. ఇలా టంబ్‌లర్ మంచి విజయాన్ని దక్కించుకుని యాహూ దృష్టిలో పడింది. 2013లో సుమారు 600 కోట్ల రూపాయల్ని చెల్లించి టంబ్‌లర్‌ను సొంతం చేసుకుంది. దాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు 28 ఏళ్ల డేవిడ్‌నే సీయీవోను చేసింది. బిజినెస్ వీక్ పత్రిక 'బెస్ట్ యంగ్ టెక్ ఎంట్రిప్రెన్యూర్'గా ఎంపిక చేసింది. ఎంఐటీ రూపొందించిన ప్రపంచంలోనే 35 మంది మేటి ఎంట్రిప్రెన్యూర్‌ల జాబితాలో అతడికి చోటు దక్కింది. తల్లిదండ్రుల నుంచి సరైన ప్రోత్సాహం, ఆశావహ వాతావరణం ఉంటే చిన్న వయస్సులోనే ప్రజ్ఞావంతులు ఉన్నత శిఖరాల్ని అధిరోహించగలరని డేవిడ్ నిరూపించాడు. ✦



అన్నంతో అనేకం

కొత్తిమీర రైస్

కావలసిన పదార్థాలు

కొత్తిమీర కట్టలు–3, బియ్యం–అరకిలో
జీలకర్ర, ఆవాలు–రెండు టీ స్పూన్స్
పచ్చిమిరపకాయలు–6, అల్లంముక్కలు –1 టేబుల్ స్పూన్, వేరుశేనగ గుళ్ళు– 1 టేబుల్ స్పూన్
జీడిపప్పు–1 టేబుల్ స్పూన్, ఉప్పు– తగినంత

తయారు చేయు విధానం

ముందుగా అన్నం వండి పక్కన ఉంచుకోవాలి. ఆ తరువాత పొయ్యి మీద మూకుడు ఉంచి నూనె కాగిన తర్వాత కొత్తి మీర వేయించి దానిలో జీలకర్ర, ఆవాలు, పచ్చిమిరపకాయల ముక్కలు , అల్లం ముక్కలు, వేరుశనగ గుళ్ళ, జీడిపప్పు వేసి వేయించుకోవాలి. కొంచెం వేగిన తర్వాత పసుపు ,ఉప్పు, వండిపెట్టుకున్న అన్నం వేసి బాగా కలియబెట్టాలి. ఇంకేముంది కొత్తిమీర రైస్ రెడీ.

పులగం

కావలసిన పదార్థాలు

బియ్యం–ఒకటిన్నర కప్పు
పెసరపప్పు–అరకప్పు
నెయ్యి– టీ స్పూన్
జీలకర్ర– టీ స్పూన్
మిరియాలపొడి – పావుటీ స్పూన్, ఉప్పు– తగినంత
నీళ్ళు– మూడున్నర కప్పులు
జీడిపప్పు– 10

తయారు చేయు విధానం

బియ్యం, పప్పు కడిగి 20 నిమిషాలు నానబెట్టాలి. గిన్నెలో నెయ్యి వేడయ్యాక జీలకర్ర, మిరియాలు వేసి వేయించాలి, నీళ్ళు పోసి మరుగుతుండగా నానబెట్టిన బియ్యం, పప్పు, ఉప్పు వేసి ఉడికించాలి. అన్నం అయ్యాక జీడిపప్పు పలుకులు వేసి కలపాలి.

పులిహోర

కావలసిన పదార్థాలు

బియ్యం–అరకిలో
శనగపప్పు–రెండు టీ స్పూన్లు
వేరుశనగ పప్పు–50 గ్రాములు
పసుపు–1 టీ స్పూను
ఆవాలు–1 టీ స్పూను
జీలకర్ర–1 టీ స్పూను
కరివేపాకు–రెండు రెమ్మలు
ఎండు మిరపకాయలు–4
పచ్చి మిరపకాయలు–6
నిమ్మకాయలు–2 (పెద్దవి)
ఉప్పు–తగినంత
నూనె– 4 టీ స్పూన్లు

తయారు చేయు విధానం

ముందుగా అన్నంను కొంచెం పలుకుగా వండి వార్చి ఒక పళ్ళెంలో పక్కన పెట్టుకోవాలి. తర్వాత పళ్ళెంలో ఉన్న అన్నానికి కొంచెం నూనె, పసుపు, ఉప్పు వేసి అన్నం మొత్తం కలిసేటట్టు కలియబెట్టాలి. ఆ తరువాత మూకుడు తీసుకుని దానిలో నూనె వేసి శనగపప్పు, వేరుశెనగ గుళ్ళు, జీలకర్ర , పచ్చి మిరపకాయలు, ఎండు మిర్చి కలిపి వేయించాలి. ఇలా వేయించిన తాలిం పును ముందుగా కలిపి పెట్టుకున్న అన్నంలో వేసి కలిసేటట్టు అటూ ఇటూ తిప్పాలి. అంతా బాగా కలిశాక నిమ్మకాయ రసం పిండుకుంటే పుల్ల పుల్లగా చాలా రుచిగా ఉంటుంది.

కొబ్బరి రైస్

కావలసిన పదార్థాలు

కొబ్బరి చిప్పలు–2
బియ్యం–అరకిలో
జీలకర్ర, ఆవాలు– రెండు టీ స్పూన్స్, పచ్చిమిరపకాయలు–6
ఎండు మిర్చి– 4 కాయలు
అల్లం ముక్కలు–1 టేబుల్ స్పూన్, కరివేపాకు–రెండు రెబ్బలు, వేరుశనగ గుళ్ళు– 1 టేబుల్ స్పూన్, జీడిపప్పు–1 టేబుల్ స్పూన్, నిమ్మకాయ–1
ఉప్పు–తగినంత

తయారు చేయు విధానం

ముందుగా అన్నం వండి పక్కన ఉంచుకోవాలి. తరువాత కొబ్బరి చిప్పలను కోరుకోవాలి. ఆ తర్వాత స్టౌమీద మూకుడు ఉంచి నూనె పోసి కాగిన తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, అల్లం, కరివేపాకు, వేరుశనగ గుళ్ళు, జీడిపప్పు. ఎండు మిర్చి కలిపి వేయించుకోవాలి. బాగా వేగిన తర్వాత కోరి ఉంచుకున్న కొబ్బరి తురుము వేసి వేయించుకోవాలి. ఇది కొంచెం వేగిన తర్వాత అన్నం వేసి దానిలో కొంచెం ఉప్పు కలిపి బాగా కలియబెట్టాలి. దించే ముందు నిమ్మకాయ పిండుకుంటే పుల్లపుల్లగా రుచిగా ఉంటుంది.

దేశాలు...వంటలు

ఒక్కొక్క దేశంలో ఒక్కో వంటకం రుచిగా ఉంటుంది కదా. అయితే మీ కోసం కొన్ని దేశాల చిత్ర పటాలు వాటికి ఎదురుగా వివిధ వంటకాలు ఇచ్చాం. మరి ఏ వంటకం ఏ దేశానిదో గుర్తిస్తారు కదా.

1. Haggis		A		South Africa
2. Tagine		B		Italy
3. Tteokbokki		C		India
4. Paella		D		Scotland
5. Escargot		E		South Korea
6. Pizza		F		Morocco
7. Bobotie		G		Japan
8. Taco		H		Mexico
9. Sushi		I		France
10. Curry		J		Spain

జవాబులు: 1-D, 2-F, 3-E, 4-J, 5-I, 6-B, 7-A, 8-H, 9-G, 10-C

రంగులేద్దాం

ఆర్టిస్ట్ అంకుల్ మీకు ఇష్టమైన వాల్ట్ డిస్నీ బొమ్మను గీశాడు. అయితే వాటికి రంగులు వేయడం మరిచారు. ఆ పని మీరు చేసేస్తారా!

దారి కనుక్కోండి?

చుక్కలు కలపండి

నీడ గుర్తించండి?

రంగు రంగుల సీతాకోక చిలుకలు అంటే చాలా ఇష్టం కదా, మీ కోసం కొన్ని సీతాకోకచిలుకలు ... వాటి నీడలు ఇచ్చాం. మరి దేని నీడ ఏదో చెప్పకోండి.



తెలివైన అన్నాచెల్లెళ్లు



తనిష్క్ అబ్రహం, తియారా అబ్రహం అన్నా చెల్లెళ్లు. ఇద్దరూ ఎవరికీ వారే చాలా తెలివైనవాళ్లు. అన్నేమో చదువుల్లో, చెల్లేమో చిత్రకళలో ప్రతిభను చాటుతున్నారు. అమెరికాకు చెందిన వీళ్ల మూలాలు ఇక్కడివే. తనిష్క్, తియారాలు ఐక్యూ పరీక్షల్లో మంచి మార్కులు కొట్టేసి మెన్సా అనే తెలివైనవాళ్ల సంఘంలో చోటు సంపాదించారు.

తనిష్క్ పదకొండేళ్లకే కాలేజీలో చేరి తనకన్నా పెద్దవాళ్లతో పోటీపడి చదివాడు. క్లాస్ టాపర్‌గా నిలిచి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఆ ఏదో మామూలు సబ్జెక్టుల్లో అనుకోకండి. అంతరిక్ష శాస్త్రంతోపాటు భౌతిక, జీవ, రసాయన శాస్త్రాల్లో అందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాడు. అమెరికాకే అధ్యక్షుడినవుతానని చెప్పే తనిష్క్ ఆలోగా డాక్టర్ అవుతాడట. ఎండీ చేసి పరిశోధన సాగిస్తాడట. కాలేజీలో ఉన్నప్పుడే తనిష్క్ ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు తన కోసం సైన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ తనిష్క్ స్ట్రాటోస్పియర్ వాతావరణంపై పరిశోధన చేశాడు. పియానో వాయించడంలో కూడా నేర్పరి అయిన తనిష్క్‌కు చెస్, డ్యాన్స్, ఈత, ఫుట్‌బాల్ అంటే ఇష్టమట. ఎనిమిదేళ్ల వయసునప్పుడే తనిష్క్ 2011లో నాసా నిర్వహించిన పౌర అంతరిక్ష ప్రాజెక్ట్ 'జూనివర్స్'లో పాలుపంచుకున్నాడు. కెప్లర్ పరికరం తీసిన చిత్రాలను పరిశోధించి రెండు సూపర్‌నోవాలను, సౌర తుఫానును, ఒక వెలుపలి గ్రహాన్ని గుర్తించాడు. నాసా లూనార్ సైన్స్ సమావేశంలోను పాల్గొని చంద్రుడికి సంబంధించిన మూన్‌మ్యాపర్స్, మూన్‌జూ పరిశోధన వివరాల్ని ఇచ్చాడు. తనిష్క్ ప్రతిభను గమనించిన అనేక టీవీ చానళ్లు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాయి. ఎన్నో అవార్డులు కూడా వచ్చాయి.

బొమ్మను గీస్తే..

తనిష్క్ కన్నా రెండేళ్లు చిన్నదయిన తియారా చిత్రలేఖనంలో మంచి ప్రతిభను చాటుతోంది. నాలుగేళ్లకే మెన్సా సంఘంలో ఈమె పేరు చేరిపోయింది. పై తరగతులకు జంప్ చేస్తూ తనకన్న పెద్దవారితో కలసి చదువుతోంది. అయితే తియారా ప్రత్యేకంగా కళలపైనే దృష్టిపెట్టింది. పెయింటింగ్‌తో పాటు పాటలు కూడా బాగా పాడుతుంది. నాలుగేళ్ల వయసులో 'మై బ్రదర్, మై ఫ్రెండ్' పేరుతో ఆమె వేసిన పెయింటింగ్ ప్రఖ్యాత కాలిఫోర్నియా స్టేట్ యూత్ ఆర్ట్ అండ్ డిజైన్ ఎక్స్‌పొజిషన్ 2011కు ఎంపికై ప్రశంసలు పొందింది. ఆ తర్వాత రెండో ఏడాదికే అదే పోటీలో తన 'గోల్డెన్ గేట్ ఎట్ సన్‌సెట్' అనే చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చింది. ఒకరంటే ఒకరికి చాలా ఇష్టం. పేరు కోసం పోటీ పడకుండా, ఒకరికొకరు సాయం చేసుకుంటారు. ✦

వివిధ కోణాల్లో బ్రాహ్మణవాదం

బ్రాహ్మణిజం భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థల్ని మూడు వేల ఏండ్లుగా ఎదక్కుండా చేసింది. దాని పరిణామ క్రమాన్ని కత్తి పద్మారావు గారు 'బ్రాహ్మణవాదం-మూలాలు' పుస్తకంలో చాలా కోణాల నుండి పరిశోధించారు. ఎన్నో హిందూ గ్రంథాలను ఆయన క్రిటికల్‌గా అధ్యయనం చేసి వాటిపై తమ విమర్శను ఈ పుస్తకంలో పొందుపర్చారు.

ఒకవైపు గ్లోబలైజేడ్ ప్రజా జీవనంలో కొన్ని మౌలిక మార్పులు వస్తున్నప్పటికీ బ్రాహ్మణీయ-హిందూ గ్రంథాల మూలంగా రూపొందించిన ఎన్నో సినిమాలు దళిత బహుజన ప్రజానీకంపై ఎనలేని ప్రభావాన్ని చూపుతున్నాయి. కుల వ్యవస్థే ఒక మూఢ నమ్మకమైందైతే హిందూ గ్రంథాలన్నీ చాలా మూఢ నమ్మకాలను ప్రజల జీవితంలోకి గుప్పిస్తున్నాయి. హిందూయిజం, క్రిస్టియానిటీ, ఇస్లాముల్లా ఒక మతం కాదు. అది ప్రజా సమూహాలను సర్వ సమానులుగా సమీకరించదు. అది వారిని కులాల వారీగా బంధిస్తూనే బ్రాహ్మణీయ శక్తులకు మనుషులు బానిసలయ్యేలా తయారు చేస్తుంది. పద్మారావు గారు రాసిన ఈ పుస్తకం సమాజం మీద బ్రాహ్మణీయ శక్తులు, గ్రంథాల ప్రభావం తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుంది.

దాదాపు 450 పేజీల ఈ పుస్తకం బ్రాహ్మణవాదాన్ని వివిధ కోణాల నుండి చర్చించింది, ఇందులో ఆదిమ దశ నుండి ఆధునిక దశ వరకు బ్రాహ్మణవాదంపై చర్చ ఉంది. ఈ దేశంలో బ్రాహ్మణిజం వల్ల ఏర్పడిన వివిధ సంక్షోభాల మీద కూడ చర్చ ఉంది. బ్రాహ్మణిజాన్ని ఓడించి ఈ సమాజాన్ని కుల రహిత సమాజంగా మార్చాలంటే దానికి వ్యతిరేకంగా ఎన్నో రూపాల పోరాటాలు జరగాలి. దళిత మహాసభ మన రాష్ట్రంలో 1980 దశకంలో అటువంటి పోరాటాలకు పునాదులు వేసింది. పద్మారావుగారు ఒక రచయితగా, ఉద్యమ నాయకుడుగా బ్రాహ్మణీయ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. పోరాటాల్ని ముందుకు తీసుకుపోవడానికి కూడా ఇటువంటి రచనలు చాలా అవసరం.

- కంచ ఐలయ్య



భారత సామాజిక చరిత్ర
బ్రాహ్మణ వాదం-మూలాలు, డా॥కత్తి పద్మారావు,
పేజీలు: 497,
ధర: రు 300/-,
ప్రతులకు: కత్తి స్వర్ణ కుమారి, లోకాయత ప్రచురణలు, లుంబిని వనం, అంబేడ్కర్ కాలనీ, పొన్నూరు- 522 124. ఫోన్: 98497 41695.

కార్మిక హక్కుల దీక్షా దినం మేడే

కుల, మతాలు, ప్రాంతాలు, దేశాలు, ఖండాలకు అతీతంగా అంతర్జాతీయంగా, విశ్వ శ్రామిక జనులు ఐక్యంగా కర్తవ్య సాధనకై కార్మిక వర్గం జరుపుకునే పండుగ -దీక్షాదినమే "మేడే". సమస్త సరుకులు శ్రమ జనితాలే అని మార్క్స్ నిరూపించాడు. 167 సంవత్సరాల చరిత్ర! మార్క్స్ -ఏంగెల్స్ రాసిన "కమ్యూనిస్టు ప్రణాళిక" కు ముందే కార్మిక వర్గం తమ బాధలపై పోరాటం చేశారు. వర్తమానాన్ని మార్చే ప్రయత్నం చేశారు. శ్రమ జీవులకు సిద్ధాంత ఆయుధాన్ని ఇచ్చింది. మార్క్సిజం. "పోరాడితే పోయేది ఏమీ లేదు. బానిస సంకెళ్ళు తప్ప" అని మార్క్స్-ఎంగెల్స్ నిరూపించారు. చికాగోలో 8 గంటల పనివేళలకై జరిగిన కార్మిక సమ్మె. సమ్మె అంటే కార్మికుల చేతిలోని చివరి ఆయుధం అని... అది అనేక అనుభవాలను నేర్పే గొప్ప పాఠశాల అని లెనిన్ అంటారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఫలాలు సమాజాభివృద్ధితో పాటు శ్రామికులకు ఉపయోగపడాలి. కాని పెట్టుబడి దారీ వ్యవస్థలో శ్రామికులపై దోపిడీ తీవ్రతకు అవి సాధనాలుగా మారాయంటారు. చిత్రబ్రత మజుందార్,పిళ్ళా కుమారస్వామి, ఎస్.వీరయ్య, లక్ష్మీ నరసయ్య, లెనిన్ వ్యాసాలు... రాంభట్ల, తెలకపల్లి రవి, శ్రీశ్రీ పాటలు చికాగో అమరవీరుల ముఖ చిత్రం, ఆగస్ట్ స్పైస్, జార్జి ఏంగిల్స్, ఆడాల్ఫ్ ఫిషర్, అల్బర్స్ పార్సన్స్ ముఖ చిత్రాలు ఈ పుస్తకం పవిత్రతను త్యాగ స్ఫూర్తిని నింపాయి. 1806లో అమెరికాలోని కార్మికుల తిరుగుబాట్లు, 1864 అక్టోబర్, అమెరికా, కెనడా ఆర్గనైజ్డ్ లేబర్ యూనియన్ల 4వ మహాసభ, 1886 మే నుండి 8 గంటల పనికై పిలుపు..మే 1 సమ్మె 25 లక్షల మంది సమ్మెలో ప్రవేశించడం. ఒక్క చికాగోలోనే 4 లక్షల మందితో సమ్మె, 1886 మే 4 తేదిన "హే" మార్కెట్ ప్రదర్శన- కాల్పుల్లో కార్మికుల అమరత్వం! పాలక వర్గాలకు అండగా నిల్చిన న్యాయస్థానం. కార్మికులకు నేతృత్వం వహించిన అల్బర్స్ పార్సన్స్, ఆగస్ట స్పైస్, అడాల్ఫ్ ఫిషర్, జార్జి ఎంగిల్స్, స్పైస్‌లను 1887 నవంబర్ 11న ఉరి తీశారు. రష్యా, బ్రెజిల్, ఐర్లాండ్, చైనా1920, ఇండియాల్లో1927 మేడే ప్రదర్శనలు, 2004లో ఇంగ్లాండులో మే 1 ప్రదర్శనపై పోలీసు జులుం 1826లో హౌరా కార్మికుల (రైల్వే) సమ్మె, చికాగో స్మృతి చిహ్నం ఏర్పాటు, కార్మిక ప్రముఖుల ప్రవచనాలు, నేటి దేశ పరిస్థితులు ప్రపంచీకరణకు దెబ్బ తిన్న దేశాలు అసంఘటిత కార్మిక రంగ స్థితి, లాంటి అంశాన్ని ఈ పుస్తకంలో ప్రస్తావించారు.

- తంగిరాల చక్రవర్తి



కార్మికుల హక్కుల దీక్షా దినం మేడే, రచన, కూర్పు: పిళ్లా కుమార స్వామి,
పేజీలు: 56, వెల 53/-,
ప్రతులకు: జి.లక్ష్మీదేవి, 28/3/394, శారద నగర్, అనంతపురం. మరియు ప్రజాశక్తి, విశాలాంధ్ర, దిశ బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

రాళ్లు పోగేసి ప్యాలెస్

చెవాల్ సమాధి

ఒక్కో రాయి పేరుస్తూ చరిత్రలో తన పేరుతో ప్యాలెస్ కట్టేసుకున్నాడు. పోగైన ఆ రాళ్లు ఓ అద్భుత కళాకట్టడమై నిలిచాయి . నిర్మాణ కళతో పరిచయంలేని ఈ ఫ్రెంచి పోస్ట్‌మ్యాన్ నైపుణ్యం పరిశోధకులను నేటికీ విస్మయపరుస్తోంది. 33 ఏళ్లపాటు అంకితమై ఒక్కడు సృజించిన ఈ కట్టడం పూర్తై వందేళ్లవుతోంది. ప్యాలెస్ డి ఐడియల్‌గా పేరెన్నిక గల ఈ సృజనకు ఓ చిన్న రాయి కథ నడిపించింది.

ఫెర్డినాండ్ చెవాల్ ఫ్రాన్స్‌కు చెందిన డ్రోమ్‌లో చార్మ్స్ సుర్ ఐహెర్బెస్‌లో 19వ శతాబ్దం మధ్య కాలంలో జన్మించాడు. 13వ ఏటనే చదువు ఆపేసి బేకర్ అప్రెంటిస్‌గా చేరి క్రమంగా పోస్ట్‌మ్యాన్ అయ్యాడు. ఉత్తర వేలెన్స్‌లోని మారుమూల ప్రాంతమైన హాటెరైవ్స్‌లో వార్తాహరునిగా విధులు నిర్వర్తించేవాడు. రోజూ గతుకుల రోడ్డులో నడుచుకుంటూ ఇంటింటినీ చుట్టి వచ్చేవాడు. ఆ ఊరుకు పక్కగా ఉన్న గుట్ట ప్రాంతంలో రోజు జీవితం ప్రారంభమయ్యేది. ఓ సారి అతడు ఓ రాయిపై అడుగువేసి తడబడి పడిపోయాడు. అదే రాత్రి ప్యాలెస్‌లు, గుహలు ఆయనకు కలలో వచ్చాయి. అలా పదేళ్లు గడిచాక 1879లో ఆయనకు 43 ఏళ్లపుడు మళ్లీ ఆ ప్రాంతంలో రాయి మీద అడుగు వేసి జారిపడ్డాడు. తీరా చూస్తే అది చాలా ప్రత్యేకంగా కనిపించింది. చాలా వింతగా, ఓ కళాఖండంగా అనిపించింది. దాన్ని జేబులో వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. తర్వాత రోజూ ఆయనకు మరిన్ని అందమైన రాళ్లు కనిపించాయి. వాటిని పోగేశాడు. అలా రోజూ వాటిని ఏరి ఇంటికి తీసుకెళ్లేవాడు. కొన్నాళ్లకు ఆయనకో ఆలోచన తట్టింది. వాటితో ప్యాలెస్ నిర్మించాలనుకున్నాడు. మొదట సంచుల్లో, తర్వాత వీల్‌బ్రో సాయంతో భారీగా ఆ చిన్నచిన్న రాళ్లను ఓ ప్రదేశానికి తరలించాడు. రోజూ రాత్రి నూనెదీపం వెలుగులో నిర్మాణం చేపట్టాడు. 33 ఏళ్ళపాటు సాగిన ఆ నిర్మాణం చివరకు ఓ అద్భుత దృశ్యమైంది. హిందూ, క్రిస్టియన్ కళ శైలిలో ఉన్నదాని నిర్మాణం ప్రత్యేకతను సంతరించుకుంది. రకరకాల జంతువులు, దేవతా మూర్తులు, చిహ్నాల తదితరాల కలబోతతో రూపుదిద్దుకున్న ఆ ప్యాలెస్ పాబ్లో పికాసో లాంటి కళాకారుల మన్ననలు పొందింది. 20 ఏళ్ల పాటు బాహ్య గోడల్ని కట్టడానికే సరిపోయింది. సిమెంట్, సున్నం మిశ్రమంతో ఆ రాళ్లను కట్టాడు. తన భార్య, తన మరణానంతరం భౌతిక కాయాల్ని అక్కడే సమాధి చేయాలని కోరగా స్థానిక ప్రభుత్వం అంగీకరించలేదు. డెబ్భై ఏళ్ల వయసులో మరో ఏడేళ్లు కష్టపడి హాటెరైవ్స్ శ్మశానంలో 'టూంబ్ ఆఫ్ సైలెన్స్ అండ్ ఎటర్నెల్ రెస్ట్' పేరిట మరో అద్భుత కట్టడాన్ని నిర్మించాడు. ఇప్పుడు అక్కడే ఆయన శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్నాడు. 1969లో ప్రభుత్వం వాటిని గౌరవిస్తూ సంరక్షణ చర్యలు తీసుకుంది. చెవాల్ పేరిట ఆ నిర్మాణాల ఫొటోగ్రాఫిక్ పోస్ట్‌కార్డులను ప్రచురించింది. ఏటా లక్ష మంది పర్యాటకులు కేవలం ఆ కట్టడాన్ని చూసేందుకు ఆ మారుమూల ప్రాంతాన్ని సందర్శిస్తారు.

●

ప్యాలెస్ ముందు భాగం

కట్టడం దగ్గర చెవాల్ చిత్రం





రేకా గణితం

విరబూసిన ప్రకృతి కొత్త లెక్కల్ని కడుతోంది. తనలో విప్పార్చుకున్న పూరేకులతో రేఖగణిత పాఠాల్ని అందంగా వల్లెవేస్తోంది. త్రికోణాలు, వృత్తాలు, గోళాల ఆకృతులతో వన్నెలీనుతున్న ఈ రేకా గణితం మీ కోసమే. సవ్యదిశ (క్లాక్ వైజ్)లో వాటి వివరాలు..(ఎడమ వైపునున్న తొలి పువ్వును విడిచి)

కామెల్లియా - తూర్పు హిమాలయాలు - తేనీరులో కలుపుతారు.

పాస్సిఫ్లోరా - దక్షిణ అమెరికా - ప్రత్యేకమైన సుగంధాన్ని వెదజల్లుతుంది.

ఎకినాసియా - ఉత్తర అమెరికా - జలుబు, జ్వరానికి మందులా వాడతారు.

క్రాసులా - దక్షిణాఫ్రికాలోని ఈస్టన్ కేప్ - అత్యంత నాజూకైన ఇవి వాతావరణంలో కాస్త తేడా వచ్చినా వడలిపోతాయి.

హోయా ఆల్బిచి - ఆసియా, ఆస్ట్రేలియా - రాత్రుళ్లు గాఢమైన సువాసన కల్గిన ఇవి కాలుష్యాన్ని హరిస్తాయి.

ఫ్లవర్ పెటల్స్ - ఆసియా - వంటికి ధరించే ఆభరణాల డిజైన్లను పోలి ఉంటాయి.

దాహ్‌లియా - మెక్సికో - ఓవాక్సకన్ వంటకాల్లో ఉపయోగిస్తారు.

లోబెలియా - ఉష్ణ మండల ప్రాంతాలన్ని - కోటిన్నర ఏళ్ల నుంచి మనుగడలో ఉన్నాయి.

హోయా కెర్రి - ఆసియా - సుమ గంధానికి పేరు.

పొద్దుతిరుగుడు - ఆసియా తదితర ప్రాంతాలు - వీటి గింజలతోనే సన్‌ఫ్లవర్ నూనెను తీసేది.

డ్రోసోఫిల్లమ్ - పోర్చుగల్, మొరాకో, స్పెయిన్ - కీటక భక్షకులైన ఇవి చవుడు నేలల్లో జీవిస్తాయి.

•